ప్రజాశక్తి

గురువారం 17 జూలై 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సెజ్‌పై భగ్గు

ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు

- కోటపాడులో రైతులు భారీ ర్యాలీ, ధర్నా
- భూములిచ్చేది లేదని స్పష్టీకరణ
- ప్రశాంత ప్రాంతాన్ని కాలుష్య, ప్రమాదభరితంగా మార్చొద్దు : సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి - **కె.కోటపాడు :** తమ వ్యవసాయ భూములను సెజ్‌కు ఇవ్వడానికి జరుగుతున్న ప్రయత్నాలపై అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలంలోని ఆర్లి, చింతపాలెం, గరుగుబిల్లి, గుల్లేపల్లి గ్రామాలకు చెందిన రైతులు భగ్గుమన్నారు. సెజ్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ భూములిచ్చేది లేదని తేల్చిచెప్పారు. ఈ క్రమంలోనే వారు బుధవారం ఆందోళన బాట పట్టారు. కోటపాడు పాత విజయ సినిమా హాల్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. భూములు ఇవ్వబోమని వ్యక్తిగత ధరఖాస్తులను తహశీల్దార్‌కు అందజేశారు. తహశీల్దార్ రైతులను ఒప్పించే ప్రయత్నం చేసినా ఎవ్వరూ ఒప్పుకోలేదు. తమకు తెలియకుండా రెవెన్యూ అధికారులు రహస్య సర్వే ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. వారి పోరాటానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మద్దతు తెలిపి మాట్లాడారు. సెజ్ నిర్మాణానికి కావాల్సిన 1012 ఎకరాల భూమి పై ప్రాంతాల్లో ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించి కేటాయింపులకు ప్రయత్నిస్తోందన్నారు. 602 మంది రైతుల నుండి 700 ఎకరాల డిఫారం మెట్టు భూములు, అలాగే విశాఖ స్టీల్‌ప్లాంట్ (గ్రీన్ బెల్ట్)కు మొక్కల పెంపకం కోసం కేటాయించిన 300 ఎకరాలను సెజ్‌కు కేటాయించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సెజ్‌లకు స్థల కేటాయింపులు ఏ జోన్ కిందకు వస్తాయో ముందుగా స్పష్టం చేయాలన్నారు. ఇప్పటికే సెజ్‌లు ఏర్పాటు చేసిన అచ్యుతాపురం, పరవాడ ప్రాంతాల్లోని పరిస్థితులను లోకనాథం వివరించారు. విదేశాల్లో నిషేధించబడిన, ప్రమాదకరమైన కంపెనీలను మాత్రమే అక్కడకు ఎక్కువుగా తీసుకొచ్చి నెలకొల్పారన్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అక్కడి కంపెనీల ద్వారా వచ్చే వ్యర్థాలను సముద్రంలోకి వదిలి పెడుతున్నారని, మరి ఇక్కడకు అదే ప్రమాదకరమైన కంపెనీలను తీసుకొస్తే వ్యర్థాలను ఎక్కడకు పంపిస్తారని అడిగారు. ప్రశాంతమైన ప్రాంతాన్ని కాలుష్య, ప్రమాదపూరిత ప్రాంతంగా మార్చొద్దన్నారు. కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ, మాడుగుల, రావికమతం, మిగతా 2లో..

వినతిపత్రం అందజేస్తున్న లోకనాథం, వెంకన్న, రైతులు

వైసిపి ఫిరాయింపు

కార్పొరేటర్లకు షాక్

టిడిపి, జనసేన, బిజెపిలోకి వెళ్లిన వారికి కలెక్టర్ షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైసిపి ఫిరాయింపు కార్పొరేటర్లకు షాక్ తగిలింది. కొద్ది నెలల క్రితం జివిఎంసి మేయర్, డిప్యూటీ మేయర్లపై టిడిపి, జనసేన, బిజెపి కూటమి పార్టీల కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానాల సమయంలో వైసిపి నిర్ణయానికి వ్యతిరేకంగా ఓటు వేసిన ఆ పార్టీ కార్పొరేటర్లకు విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ బుధవారం షోకాజ్ నోటీసులు పంపించారు. విప్ ప్రకారం.. నాటి మేయర్, డిప్యూటీ మేయర్లకు అనుకూలంగా ఓటు వేయవలసి ఉండగా అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 27 మంది వైసిపి కార్పొరేటర్లు నాడు ఓటు వేశారు. ఈ మేరకు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘానికి, జిల్లా కలెక్టర్‌కు ఓ లేఖ రాశారు. తమ పార్టీ కార్పొరేటర్లకు విప్ జారీ చేశామని, దాన్ని ధిక్కరించి, పార్టీ నిర్ణయించిన అభ్యర్థులకు వ్యతిరేకంగా 27 మంది కార్పొరేటర్లు ఓట్లు వేశారని, ఇది చట్ట విరుద్ధమని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వారిపై చట్ట ప్రకారం చర్య తీసుకోవాలని, వారందరినీ అనర్హులను చేయాలని కోరారు. ఈ క్రమంలో కలెక్టర్ 27 మంది ఫిరాయింపు వైసిపి కార్పొరేటర్లకు నోటీసులు పంపించారు. వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. సమాధానాలు అందిన తర్వాత చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నాడు వైసిపి నుంచి టిడిపి, జనసేన, బిజెపిలోకి ఫిరాయించి, అవిశ్వాస తీర్మానాలకు అనుకూలంగా ఓటు వేసిన వారిలో ముత్తంశెట్టి ప్రియాంక (6వ వార్డు), లొడగల అప్పారావు (8వ వార్డు), కెల్ల సునీత (13వ వార్డు), గెద్దాల లావణ్య (17వ వార్డు), గుడ్ల విజయసాయి (23వ వార్డు), సారిపల్లి గోవిందరాజుల వెంకట అప్పారావు అలియాస్ సారిపల్లి గోవింద్ (25వ వార్డు), ఉరుకూటి నారాయణరావు (29వ వార్డు), కోడూరు అప్పలరత్నం (30వ వార్డు), మాసిపోగు మేరీ జోన్స్ (36వ వార్డు), ఆళ్ళ లీలావతి (42వ వార్డు), పెద్దిశెట్టి ఉషశ్రీ (43వ వార్డు), కంపా హనోక్ (45వ వార్డు), కంటిపాము కామేశ్వరి (47వ వార్డు), చల్లా రజిని (54వ వార్డు), ముర్రు వాణి (57వ వార్డు), పుర్రే పూర్ణ శ్రీ (59వ వార్డు), కొణతాల సుధ (61వ వార్డు) బొడ్డు నరసింహ పాత్రుడు (65వ వార్డు), రాజాన రామారావు మిగతా 2లో..

విశాఖ విమల విద్యాలయాన్ని తెరవాలి

వార్త 4లో..

మాస్టర్ ప్లాన్‌పై సలహాలు, సూచనల స్వీకరణ

వార్త 2లో..

భూనిర్వాసితుల పాదయాత్ర

వార్త 8లో..

కరపత్రాలు, స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ, వార్వా, నివాస్ నాయకులు

స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న.. అదాని ప్రతినిధులను తరిమికొట్టండి

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

వార్త 4లో..

మానవ అక్రమ రవాణా ముఠా అరెస్ట్

రూ.2.3 లక్షల నగదు, 20 సిమ్ కార్డులు స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నకిలీ వీసాలు, ఉద్యోగ ఆఫర్ లెటర్లతో విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ప్రజలను నమ్మించి మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాను విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ మోసాలకు సంబంధించి బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ పలు విషయాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. కంబోడియా, తదితర దేశాల్లో డేటా ఎంట్రీ ఉద్యోగం అని నలుగురు యువతీ యువకులకు చెప్పి వారిని అక్కడకు పంపించేందుకు గాజువాకకు చెందిన ఏజెంట్ సురేష్, ఆదిలక్ష్మి అలియాస్ అను ప్రయత్నించారు. వారిని ఈ నెల 14న విశాఖ ఎయిర్ పోర్టు వద్ద అరెస్టు చేశారు. వారిని విచారించగా సురేష్ ఇంతకు ముందే కంబోడియా వెళ్లి అక్కడ ఓ స్కాం కంపెనీలో పనిచేసినట్టు తెలిసింది. అక్కడ విజయ్ కుమార్ అలియాస్ సన్నీతో పరిచయం పెంచుకొని ఇటీవల ఇండియాకు వచ్చి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో కంబోడియాలో ఉన్న వారికి ఏజెంట్‌గా మారాడు. నిరుద్యోగ యువతకు మాయమాటలు చెప్పి ఆదిలక్ష్మి అలియాస్ అను సాయంతో విజయ్ కుమార్ అలియాస్ సన్నీ సూచనలతో కంబోడియాకు పంపిస్తున్నాడు. అక్కడి స్కాం కంపెనీలకు ప్రధాన ఏజెంట్‌గా సన్నీ ఉన్నట్టు పోలీసు విచారణలో వెల్లడైంది. అడని కోసం గాలిస్తున్నారు. తాజాగా దొరికిన ఇద్దరి నుంచి రెండు సెల్ ఫోన్లు, రూ.50 వేల నగదు, 2000 డాలర్లు (రూ.1,80,000) , 20 సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు 12 మందిని విదేశాలకు పంపించినట్టు తేలింది.

కేసు వివరాలను వెల్లడిస్తున్న సిపి శంఖబ్రత బాగ్చీ

మొదటి పేజీ తరువాయి..

వైసిపి ఫిరాయింపు కార్పొరేటర్లకు షాక్

(71వ వార్డు), తిప్పల వంశీ రెడ్డి (74వ వార్డు), బట్టు సూర్యకుమారి (77వ వార్డు), కొణతాల నీలిమ (80వ వార్డు), పీలా లక్ష్మీ సౌజన్య (81వ వార్డు), ఇళ్లపు వరలక్ష్మి (85వ వార్డు), కుంచె జ్యోత్స్న (91వ వార్డు), బెహరా వెంకట స్వర్ణలతాదేవి (92వ వార్డు), ముమ్మన దేవుడు (95వ వార్డు) ఉన్నారు.

సెజ్‌పై భగ్గు

రోలుగుంట, నర్సీపట్నం ప్రాంతాల వాసులు సేఫ్ జోన్‌లో కాలుష్య ప్రభావం లేకుండా ప్రశాంతంగా బతుకుతున్నారని తెలిపారు. అక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నమ్మించి నేడు విషం చిమ్మే కంపెనీలను తీసుకువచ్చి ప్రజల ప్రాణాలను, పచ్చని పంట పొలాలను నాశనం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కోటపాడు కేంద్రంగా ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మాడుగుల నియోజకవర్గంలో అత్యధిక రిజర్వాయర్లు ఉన్నాయని, ఇక్కడి భూములు వ్యవసాయ యోగ్యమైనవని, ఈ నేపథ్యంలో పరిశ్రమలు పెట్టేకన్నా వ్యవసాయానికి అనుబంధమైనవాటిని ఎలా అభివృద్ధి చేయాలన్న అంశంపై ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, గీతకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి యర్రా దేముడు, ఈర్లె నాయుడు బాబు, గాడి ప్రసాద్, ఆర్ఎ.పాత్రుడు, రుత్తల గోవింద్, బోళం సూరిబాబు, ములగపాక సోమేష్, తాళ్ల నాగేష్, తాళ్ల పైడిరాజు, కక్కల యాతనాయుడు, కక్కల నాయుడు, దేముడు, రాము, రుత్తల మంగ పాల్గొన్నారు.

కెజిహెచ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

ప్రజాశక్తి - విశాఖకలెక్టరేట్ : కెజిహెచ్‌లో పనిచేస్తున్న రెగ్యులర్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ (క్లాస్ ఫోర్) ఉద్యోగులు 250 మందికి నెలవారీగా వచ్చే వేతనం రూ.1500 కూడా లేనందున, ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం, పెన్షన్లు, అన్నదాత సుఖీభవ పథకాలకు అర్హులుగా గుర్తించి పథకాలు అమలయ్యేలా చూడాలని కోరుతూ ఎన్‌జిఒ సంఘం అధ్యక్షుడు డి.విరమణకు బుధవారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వినతిపత్రం అందించారు. కెజిహెచ్‌లో పలు విభాగాల్లో పనిచేస్తున్నామని, నెలకు రూ.1500 వేతనం ఇస్తుండగా, అందులో పిఎఫ్, ఈఎస్‌ఐ పోగా రూ.1308 మాత్రమే వస్తోందన్నారు. చాలీచాలని వేతనాలతో అవస్థలు పడుతున్నామన్నారు. తమకు ప్రభుత్వ పథకాలు కూడా అందడం లేదని తమను ఎంప్లాయ్‌గా చూపుతున్నారని అందువల్ల పథకాలు అందడం లేదన్నారు. ఎంప్లాయ్ అనే పదాన్ని తొలగించాలని, సమానపనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. రిటైర్మెంట్ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఆరోగ్యశ్రీ డబ్బులు ఇప్పించాలన్నారు.

ఇగ్నో అడ్మిషన్లకు గడువు పెంపు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) జూలై 2025 విద్యాసంవత్సరానికి గానూ వివిధ దూరవిద్యా కోర్సులతో పాటూ ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం గడువు జూలై 31వ తేదీ వరకూ పొడిగిస్తున్నామని సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డా. గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఈ అడ్మిషన్లు ఆన్ లైన్ ద్వారా పొందవలసి ఉంటుంది.

ఇగ్నో వెబ్సైట్‌లో ఉన్న అడ్మిషన్ల లింక్ ద్వారా లేదా కింద ఇవ్వబడిన లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చు. https://ignouadmission.samarth.edu.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు. విశాఖపట్నం ప్రాంతీయకేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నిటిలో ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశాలు పొందే వీలుంది.. ఫీజులు కూడా ఆన్‌లైన్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన డిగ్రీ కోర్సులలో ఎస్‌సి, ఎస్.టి. విద్యార్థులకు 50 శాతం ఫీజు రాయితీ విశ్వవిద్యాలయం కల్పిస్తోంది.

మాస్టర్ ప్లాన్‌పై సలహాలు, సూచనల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ రూపొందించిన బృహత్ ప్రణాళిక - 2041పై సలహాలు, సూచనలపై పలువురు స్పందించారు. బుధవారం ఉదయం విఎంఆర్‌డిఎ కార్యాలయంలోని మూడో అంతస్తు సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాధన్, స్వయంగా వినతులు స్వీకరించారు. నగర ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, విజయనగరం ఎమ్మెల్యే అతిథి గజపతి రాజు, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, జీవీఎంసీ కార్పొరేటర్లు ఎస్.పద్మా రెడ్డి, స్టాలిన్ తదితరులు పాల్గొని తమ పరిధిలోని, తమ దృష్టికి వచ్చిన మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు. మాస్టర్ ప్లాన్‌లోని లోపాలను సరిచేయాలని సూచిస్తూ వినతులు అందజేశారు. వీరితో పాటు విఎంఆర్‌డిఎ పరిధిలోని ప్రజలు, పలు సంస్థల ప్రతినిధులు, పలు రియల్ ఎస్టేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొని వినతులు అందజేశారు.

వినతులు స్వీకరిస్తున్న ప్రణవ్‌గోపాల్, విశ్వనాథన్

వచ్చిన ముఖ్యమైన వినతులు

రుషికొండ సర్వే నెంబర్ 25లో ఎ1 గ్రాండ్ కన్వెన్షన్ సెంటర్ వద్ద ప్రతిపాదిత 60 మీటర్ల రహదారిని విభాగిని నుండి ఇరువైపులా 30 మీటర్లు ఉండేవిధంగా మాత్రమే అలైన్మెంట్ ఉండాలని స్థానిక స్థల యజమానులు కోరారు.

దసపల్లా హిల్స్ సర్వే నెంబర్ 1196లో నౌరోజీ రోడ్ నుంచి వాల్తేరు మెయిన్ రోడ్డుకు కలిపే రహదారి విస్తరణ ప్రస్తుతం నిలిపివేయాలని దసపల్లా హిల్స్ లే అవుట్ స్థలాల యజమానులు కోరారు

నిడిగట్టు గ్రామంలో ప్రతిపాదిత 24 మీటర్ల రహదారి నిర్మాణం వద్దని స్థానిక రైతులు, గ్రామస్తులు కోరారు.

నేరేళ్ళ వలస రెవెన్యూ గ్రామంలో ఎస్ఒఎస్ వద్ద ప్రతిపాదిత 70 మీటర్ల రహదారి అలైన్మెంట్ను మార్పు చేయాలని స్థానిక మధ్యతరగతి స్థల యజమానులు కోరారు.

సర్వే నెంబర్ 337/407 మధురవాడ గ్రామంలో రామానాయుడు స్టూడియో దరి జర్నలిస్టుల లే అవుట్ మీదుగా ప్రతిపాదించిన 18 మీటర్ల రహదారిని తొలగించాలని సంఘ ప్రతినిధులు కోరారు

సర్వే నెంబర్ 101 (రుషికొండ)లో 33 అడుగుల ప్రతిపాదిత గ్రీన్ బెల్ట్‌ను తొలగించాలని ఎన్ఆర్ఐ వ్యాపారవేత్త విజ్ఞప్తి చేశారు.

మధురవాడ సర్వే నెంబర్ 374/1, ఎల్పి నెంబర్ 74/88లో ప్రతిపాదిత 60 అడుగులు రహదారి స్థానే 40 అడుగుల రహదారిని కొనసాగించాలని స్థానికులు వినతి అందజేశారు.

హనుమంతువాక నుంచి జోడుగుళ్లపాలెం వరకు ప్రతిపాదిత 100 అడుగుల రహదారిని 60 అడుగులకు పరిమితం చేయాలని స్థానిక గృహ యజమానులు కోరారు

అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు నుంచి రైల్వే న్యూ కాలనీ వరకు గల ప్రతిపాదిత 100 అడుగుల రహదారిని 60 అడుగులకు పరిమితం చేయాలని పలువురు స్థానిక వ్యాపారులు నుంచి వినతి అందింది.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహిళలు తమ స్వశక్తితో ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సిన అవసరంఉందని, అల్లూరి విజ్ఞాన కేంద్రం పరిశోధన విభాగం ఇంచార్జ్ కె.పద్మ అన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 10 మెషిన్లతో ప్రారంభించిన కుట్టుశిక్షణ కేంద్రం డిమాండ్లను అనుసరించి మిషన్ల సంఖ్యను పెంచడం జరుగుతోందన్నారు. ఈ శిక్షణ కేంద్రం మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహద పడుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కమిటీ కన్వీనర్ జి.ఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి విజ్ఞాన కేంద్రం ఇప్పటికే ప్రజల సౌకర్యార్థం ఫ్రీ మెడికల్ క్యాంపు, ఫ్రీ క్లినిక్ నిర్వహించడమే గాక కంప్యూటర్ శిక్షణ కూడా అందిస్తోందని ఇప్పుడు టైలరింగ్ శిక్షణ కూడా తోడైందని చుట్టుపక్కల ఉన్న మహిళలు పెద్దఎత్తున టైలరింగ్ శిక్షణ పొందేందుకు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అల్లూరి కార్యక్రమాల కమిటీ సభ్యులు బుజ్జి మాట్లాడుతూ మరికొన్ని రోజుల్లో యోగా శిక్షణ కూడా ప్రారంభిస్తున్నామని సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. టైలరింగ్ శిక్షణ పొందాలనుకునేవారు పి.ఎన్.మణ 8330948949 ఫోన్ నంబర్‌ను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అల్లూరి విజ్ఞాన కేంద్రం బాధ్యులు ఎం.ఆర్.డి రాజు,వై సత్యనారాయణ, మహిళా నాయకురాలు కె.మణి పాల్గొన్నారు.

టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న పద్మ

దళిత మహిళలను వేధిస్తున్న వారిపై చర్యలేవీ ?

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : దళిత మహిళల్ని వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తులపై కంచరపాలెం పోలీసులు మాట్లాడకుండా ఉండడం, సోషల్ మీడియాలో బండబూతులతో మెసేజీలు పంపిస్తున్న టిడిపి కార్యకర్తలపై చర్యలు తీసుకోకపోవడంపై బాధిత మహిళలు బుధవారం జ్ఞానాపురంలో నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలని కంచరపాలెం పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోలేవడం లేదని ఆరోపించారు. జ్ఞానాపురం సెబాస్టియన్ కాలనీకి చెందిన అరసాడ లక్ష్మి, దుప్పాడ వేలంగిణి, యజ్ఞల వేలంగిణి, లంక కనక, జామివిజయతో పాటు ఆ ప్రాంత మహిళల్ని జ్ఞానాపురంలోని సాలివీధికి చెందిన కొర్లాపు కమల్‌కుమార్ అనే వ్యక్తి వేధింపులకు గురి చేస్తున్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. 4 రోజుల క్రితం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా న్యాయం చేయాలన్నారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అభ్యంతరం కాని అనధికారిక ఆక్రమణలు, నివాసయోగ్యమైన కట్టడాల క్రమబద్ధీకరణపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్ మీటింగు హాలులో వేర్వేరుగా జరిగిన విశాఖపట్టణం, భీమిలి రెవెన్యూ డివిజన్ల కాన్ఫరెన్స్ లలో పలు అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జివో 30 ఉద్దేశాలను, ఆవశ్యకతలను జివో ప్రకారం 2019 అక్టోబర్ 15 ముందు జరిగిన ఆక్రమణలను పరిగణనలోకి తీసుకొని ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. సచివాలయాల వారీగా జాబితాలను ప్రచురించాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులు, పిజిఆర్ఎస్‌కి వచ్చిన వినతుల పరిష్కారంలో చొరవ చూపాలని ఆదేశించారు. రీ సర్వే, మ్యుటేషన్ల ప్రక్రియలో పారదర్శకంగా పని చేయాలని చెప్పారు. భూముల క్రమబద్ధీకరణ విషయంలో చురుగ్గా వ్యవహరించాలన్నారు. ఆక్రమణల వివరాలను ప్రతి సచివాలయం పరిధిలో ప్రదర్శించాలని ఆదేశించారు. కోర్టు కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్ భవానీ శంకర్, ఆర్‌డిఒలు పి.శ్రీలేఖ, సంగీత్ మాథుర్, సర్వే శాఖ ఎడి సూర్యారావు, కలెక్టరేట్ ఎఒ ఈశ్వరరావు, కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) విశాఖ యూనిట్ పూర్తి కార్యవర్గాన్ని విశాఖశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఎం.కీర్తన్, జెవికె అప్పలరాజు బుధవారం ప్రకటించారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో భవిష్యత్తులో విశాఖ యూనిట్ సభ్యుల సంక్షేమానికి చేపట్టబోయే కార్యక్రమాలు, యూనిట్ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. గ్రేటర్ విశాఖలో జాప్ యూనియన్‌ను బలమైన యూనియన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. నగరంలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు కీర్తన్, అప్పలరాజు నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. గౌరవ సలహాదారులుగా పిఎఆర్ పాత్రుడు, డివి సత్యనారాయణ, ఎన్.లక్ష్మీనారాయణ, గంటా చంద్రశేఖర్, వి.ఉదయ్ కుమార్, కోశాధికారిగా ఎస్.ఎన్.నాయుడు, ఉపాధ్యక్షులుగా ఆదినారాయణ, జి.ధానేష్, కె.సందీప్, కార్యదర్శులుగా కె.పథ్వీరాజు, వై.ఎస్.ఎస్.కుమార్, వై రామకృష్ణ నియమితులయ్యారు.

మహారాజశ్రీ విజయనగరం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్యసముఖమునకు
OS 313/2021

Between :
ఒల్తేటి మహాలక్ష్మి .....వాది
And :
మజ్జి రమేష్ .....ప్రతివాది
To
మజ్జి రమేష్ S/o లేటు రామారావు, R/o డోర్ నెం. 44-49-51/2, సంజీవయ్య కోలనీ, కైలాసపురం, విశాఖపట్నం.

పై నెంబరు దావాలో ప్రతివాది తే 3-6-2018దీని, వాది వద్ద నుండి రూ. 6,00,000/- బదులు పుచ్చుకొని అదే రోజున ఒక ప్రాంశరీ నోటు వ్రాయించి ఇచ్చియున్నారు. సదరు ప్రోనోటు బాకీ తీర్చనందున OS 313/2021 దావా దాఖలు చేయగా సదరు దావా **తే 28-7-2025దీ**ని ప్రతివాది హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున పై కోర్టులో పై తేదిని **ఉదయం 10-30 గంటల నుండి సా॥ 5-00** మధ్య స్వయంగా గాని, వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యడల సదరు దావా మీ పరోక్షమందు పరిహరించడమగునని యిందుమూలకముగా తెలియపర్చడమైనది.

డి.తవిటయ్య
న్యాయవాది,
విజయనగరం

IN THE HON'BLE COURT OF THE V ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT: VISAKHAPATNAM
O.S.1349/2023

Between:
UNION BANK OF INDIA,
(e-Andhra Bank)
A.U. Campus Branch,
Visakhapatnam,
Rep. by its Branch Manager ...Plaintiff
And:
Sri Maddu Tata Rao ...Defendant
SUMMONS
To, **The Defendant:**
Sri Maddu Tata Rao,
S/o. M. Nooka Raju,
Hindu, aged 39 years,
CREW Labour,
Present R/at D.No.20-24-18,
Jalari Peta, Visakhapatnam-03.
Permanent Address:
Rajayyapeta, Nakkapalle,
Rajayyapeta,
Visakhapatnam-531 081.

Please take notice that the above O.S.1349/2023 filed by the plaintiff against you for recovery of an amount of **Rs.1,97,828/-**. The above matter stands posted to **28-07-2025** for your appearance on that day **10:30 A.M.** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte as per law.

(By Order of the Hon'ble Court)
N. SUVARNA RAJU,
Advocate
Visakhapatnam, **Cell: 98485 50336.**

IN THE HON'BLE COURT OF THE ADDL. FAMILY JUDGE AT: VISAKHAPATNAM
F.C.O.P. 721/2024

Between:
Sri Nandavarapu Satish ...Petitioner
And:
Sri Danda Deena Prasanna ...Respondent
NOTICE
To, **The Respondent:**
Sri Danda Deena Prasanna,
D/o. Eswara Rao, Hindu,
aged 26 years, R/at Flat No. 201,
SER Fortune, Opp. SLG Arcade,
CI Zone, Sujatha Nagar, Pendurthi,
Visakhapatnam-530051.

Please take notice that the above FCOP.721/2024 filed by the petitioner against the respondent for decree of divorce under Section 13 (I) (ia) (ib) of the Hindu Marriage Act.1955 and the matter stands posted to **04-08-2025** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **04-08-2025** at **10:30 A.M** in the above Court, failing which the matter will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
SINGAMPALLI SANTOSH KUMAR,
Advocate
Visakhapatnam,
Cell:9703930353.

నకిలీ పట్టాలతో బిల్డింగ్ ప్లాన్

నకిలీ పట్టాలతో ప్లాన్ తీసుకొని చేపడుతున్న భవంతి

ఇరుకు రోడ్డులో భారీ భవంతి

ప్రజాశక్తి - ఆరిలోవ : రాజకీయ నాయకుల అండదండలతోనూ, అధికారులను ప్రసన్నం చేసుకొని అనధికార, ఆక్రమిత స్థలాల్లో కట్టడాలు ఆరిలోవ ప్రాంతంలో జోరుగా సాగుతున్నాయి. ఇది ఇలా ఉంటే ఓ వ్యక్తి ఏకంగా నకిలీ పట్టాలతో భారీ భవంతి నిర్మాణాన్ని చేపట్టడం విశేషం. ఇంత జరుగుతున్నా అటు రెవెన్యూ సిబ్బంది, ఇటు జివిఎంసి సిబ్బంది అభ్యంతరం తెలపకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జివిఎంసి 11వ వార్డు పరిధి పార్వతీనగర్‌లో సుమారు 158 గజాల విస్తీర్ణంలో ఓ వ్యక్తి మూడు అంతస్తులకు పట్టణ ప్రణాళిక అధికారుల నుంచి ప్లాన్ పొందాడు. ప్లానింగ్ అధికారులకు రెండు ఇంటి నెంబర్లతో కూడిన పట్టాలు జతచేసి ప్లాన్ పొందాడు. ఒక వైపు 8 అడుగుల వెడల్పుగల ఇరుకు రోడ్డు పక్కన చేపడుతున్న ఆ భవన నిర్మాణంలో అండర్ గ్రౌండ్ కూడా అనధికారికంగా గొడౌన్ ఏర్పాటు చేశాడు. దీనంతటికీ దొంగ పట్టాల ద్వారా ప్లాన్ సంపాదించడం విశేషం. ఈ ప్రాంతంలో కొంతమందికి 2000 సంవత్సరం కంటే ముందు మాత్రమే పట్టాలు మంజూరు చేశారు. ఆ తరువాత కాలంలో రెవెన్యూ అధికారులు ఎటువంటి పట్టాలు మంజూరు చేయలేదు. ఇక్కడ బాలసాని స్వర్ణ పేరుతో ఉంటి నెంబరు 13-718/1, బాలసాని వెంకటరావు పేరుతో ఇంటి నెంబరు 13-718/2తో 60 చదరపు గజాల చొప్పున రెండు పట్టాలను 2002లో చినగదిలి మండల రెవెన్యూ అధికారులు పట్టాలు జారీ చేసినట్టు ప్లాన్‌కు జత చేశారు. మిగిలిన 38 చదరపు గజాల స్థలానికి మాత్రం చంద్రన్న పట్టా ఉంది. చంద్రన్న పట్టా ఉన్న 38 గజాలు మాత్రమే అధికారికంగా ఉంది. మిగిలిన 120 గజాల స్థలానికి సంబంధించిన పట్టాలు మాత్రం నకిలీవని రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా తేల్చినట్టు సమాచారం. నకిలీ పట్టాల ఆధారంగా జివిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్లాన్ మంజూరు చేయడం, రెవెన్యూ అధికారులు దొంగ పట్టాలపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అనేక విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు దొంగ పట్టాల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమగ్ర విచారణ జరిపిస్తాం : తహశీల్దార్

పార్వతీనగర్‌లో నకిలీ పట్టాలతో భవంతి నిర్మాణం విషయం తమ దృష్టికి వచ్చిందని, 2000 సంవత్సరం తరువాత ఆ ప్రాంతంలో ఎవ్వరికీ పట్టాలు మంజూరు చేయలేదని, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపిస్తామని చినగదిలి తహశీల్దార్ పాల్ కిరణ్ తెలిపారు. నకిలీ ధ్రువపత్రాలని తేలితే బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేరాలు ఘోరాలు

మహిళ మెడలో బంగారు ఆభరణాలు చోరీ

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలో జెవి పాలెం గ్రామంలో మహిళ మెడలోని బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ విభూషణరావు తెలిపిన వివరాలివి. బుధవారం శాంత రాజులమ్మ అనే వృద్ధురాలు, యలమంచిలి నుండి కారం ఆడించుకొని తిరిగి తన స్వగ్రామానికి వచ్చే క్రమంలో ఆటో దిగి నడుచుకొని వెళుతుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు రాజులమ్మ మెడలోని రెండు పేటల పుస్తెలతాడును తెంచుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగతనాలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ విజయకుమార్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జూన్ 23న అనకాపల్లి మండలం కొత్తూరు గ్రామం, మద్దాలవారి వీధిలో నివాసముంటున్న ఎదూరి తులసిరాణి ఇంటిలో లాకర్లో ఉన్న ఒక బంగారపు నల్ల పూసల దండ, ఒక బంగారపు గొలుసు, ఒక అంజి ఉంగరం, రెండు జతల బంగారపు చెవిలీలను కొత్తూరుకు చెందిన కోన రాకేష్ దొంగతనం చేశారు. దీనిపై అనకాపల్లి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి ఆయన వద్ద నుండి ఒక బంగారపు నల్లపూసలు సుమారు-23 గ్రాములు, ఒక బంగారపు గొలుసు సుమారు-24.5 గ్రాములు, ఒక అంజి ఉంగరం సుమారు-04గ్రాములు మొత్తం బరువు సుమారు-51.5 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు పలు దొంగతనాలు చేసినట్లు వెల్లడించారు. ఎస్ఐ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో దొంగను పట్టుకున్నారు.

లైంగిక వేధింపుల కేసులో మూడేళ్ల జైలు

ప్రజాశక్తి- భీగల్ : ఐదో తరగతి చదువుతున్న బాలికను లైంగికంగా వేధించిన అభియోగం రుజువైనందున నిందితునికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1.25 లక్షల జరిమానా విధిస్తూ బాలలపై లైంగిక వేధింపుల కేసుల విచారణ ప్రత్యేక జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి పైడి మంగాకుమారి బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా మరో మూడు నెలలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ భక్తి రాజశేఖర్ కథనం ప్రకారం... విశాఖలోని గోషా హాస్పిటల్ దగ్గరలో నిందితుడు ఇంధన సూర్యప్రకాష్ (30) నివసిస్తున్నారు. 2021 జూన్‌లో కోవిడ్ లాక్ డౌన్ సందర్భంగా స్కూలు లేని కారణంగా బాధిత బాలిక తోటి పిల్లలతో కలిసి ఆయన ఇంటికి ఆడుకునేందుకు వెళ్లేది. దాన్ని అదునుగా తీసుకున్న నిందితుడు దపదపాలుగా బాలికపై లైంగికంగా వేధించాడు. 2021 ఆగస్టు నెలలో బాలికకు కడుపునొప్పి వచ్చింది. హాస్పటల్‌కు వెళ్లి మందులు వాడినా తగ్గలేదు. ఏమి జరిగిందని బాలిక తల్లి ఒత్తిడి చేసి అడుగగా జరిగిన ఘటనలను చెప్పింది. దీంతో అదే సంవత్సరం ఆగస్టు 23వ తేదీన వన్ టౌన్ పోలీసులకు బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. నిందితునిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం నేరాభియోగ పత్రాన్ని కోర్టులో అప్పటి ఎసిపి ఎస్.శిరీష దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. జరిమానాగా విధించిన రూ.1.25 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.25 వేలు కలిపి పరిహారంగా బాధిత బాలికకు ఇవ్వాలని తీర్పులో న్యాయమూర్తి పేర్కొన్నారు.

పశుసంవర్ధక శాఖ స్థలంలో ఫెన్సింగ్‌కు సన్నాహాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి గణబాబునగర్‌లో ఉన్న పశుసంవర్ధకశాఖ ఖాళీ స్థలంలో ఫెన్సింగ్‌కు ఆ శాఖ అధికారులు సన్నాహాలు చేశారు. ఖళీగా ఉన్న ఈ స్థలంలో కొంతమంది ఆకతాయిలు, అల్లరి మూకలు గంజాయి, మద్యం తాగి స్థానికంగా ఉన్న మహిళలను, చిన్నారులను ఇబ్బందులు పెడుతున్నారని ఇటీవల సువరిపాలన, ముందడుగు కార్యక్రమంలో భాగంగా ఇక్కడకు వచ్చిన స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వెలగపూడి ఇచ్చిన ఆదేశాల మేరకు పశుసంవర్ధక శాఖ జెడీ కరుణాకరరావు, డీడీ నీలయ్య, డాక్టర్ అశోక్, జివిఎంసి డిఇ వెంకటరావు బుధవారం డెయిరీ స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలం కబ్జాకు గురికాకుండా, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఫెన్సింగ్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

17 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక డైట్‌లో ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు డిఇఇ సెట్ 2025 సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్ తెలిపారు. డిఇఇ సెట్ 2025లో అర్హత సాధించి డిఇఎల్ఇడి కోర్సుల్లో ప్రవేశం పొందే విద్యార్థులు వారికి కేటాయించిన తేదీల్లో సంబంధిత ఒరిజినల్, జెరాక్స్ కాపీలతో స్థానిక డైట్ కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు. డిఇఇ సెట్ 2025 ప్రావిజినల్ అలాట్‌మెంట్ లెటర్, అప్లికేషన్, హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఇంటర్ మెమో, పాస్ సర్టిఫికెట్, టెన్త్ సర్టిఫికెట్, ట్రాన్సఫర్ సర్టిఫికెట్, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, స్థానికత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ జెరాక్స్, పాస్ ఫొటోలతో అభ్యర్థి వ్యక్తిగతంగా హాజరు కావాలని తెలిపారు.

గ్రామాల్లో అధికారుల పరిశీలన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి, కోరాడ పంచాయతీల్లో బుధవారం జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి, డిపిఒ ఎంవిఎ.శ్రీనివాసరావు, పద్మనాభం ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపిడిఒ పి.మీనాకుమారి పర్యటించారు. తాగునీటి ట్యాంక్‌ల క్లోరినేషన్, డంపింగ్‌యార్డుల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన ఐవిఆర్ కాల్స్‌కు ప్రజల నుండి తక్కువ స్పందన రావడంతో ఈ గ్రామాలను సందర్శించారు. గ్రామంలోని అన్ని వీధులను పరిశీలించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు.

రామాలయం మూడో వార్షికోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని వెంకటాపురంలో రామాలయం మూడో వార్షికోత్సవాన్ని బుధవారం వేడుకగా నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. 5000 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.రమణ, ఎంపిటిసి మాజీ సభ్యులు గంగరాజు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనలతో మేధస్సు వికాసం

ప్రజాశక్తి -ములగాడ : సృజనాత్మకంగా ఆలోచించడం వల్ల మానవ మేధస్సు వికసిస్తుందని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్- 3 ప్రోగ్రాం అధికారి వి. అంజలీదేవి చెప్పారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో నూతనంగా డిగ్రీలో ప్రవేశించిన విద్యార్థినుల మూడు రోజుల శిక్షణ శిబిరంలో రెండవ రోజైన బుధవారం 'సృజనాత్మక ఆలోచనా విధానం'పై ఆమె మాట్లాడారు.

రవీంద్రభారతిలో 'పెట్టుబడి వేడుక'

బి.శ్రీహర్షకు బ్యాడ్జి అందిస్తున్న డిప్యూటీ కమాండెంట్ రేగి

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం ప్రాంతంలోని రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ (పెట్టుబడి వేడుక)ను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులను ఎంపిక చేసి వారికి బాధ్యతలు అప్పగిస్తూ బ్యాడ్జీలను అందజేశారు. ముఖ్య అతిథిగా ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ డిప్యూటీ కమాండెంట్ పిడి.రేగి హాజరై విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు అందజేశారు. నాయకత్వం ప్రాముఖ్యత, లక్షణాలు, సమాజానికి నాయకులు కలిగించే ప్రభావం గురించి ఆయన వివరంగా తెలియజేశారు. విద్యార్థులంతా మంచితనాన్ని అలవరచుకుని, సమాజంలో మార్పు తీసుకురావాలన్నారు. విద్యాసంస్థల చైర్మన్ ఎంఎస్.మణి మాట్లాడుతూ, విద్యార్థి నాయకులు చిత్తశుద్ధి, అంకితభావం, నిబద్ధత, శ్రేష్ఠత వంటి విలువలతో నడుచుకోవాలని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. నాయకత్వం అనేది ఒక గొప్ప బాధ్యత అని, దానిని విశ్వాసపాత్రంగా నిర్వహించాలని తెలిపారు. నార్త్ ఆంధ్ర జోనల్ ఇంచార్జ్ ఎన్.వెంకటేష్ మాట్లాడుతూ, నూతన నాయకులు పాఠశాలలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామూహిక బాధ్యతను పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ ఉమామహేష్, ప్రిన్సిపల్ బోయ జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలుచోట్ల పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం భద్రయ్యపేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ఎలమంచిలి శాస్త్రవేత్తలు ఎంబిఐఎస్ కుమారి, స్థానిక మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.వెంకటాచలం వరి నారుమడులను పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి నారు మడిలో రసం పీల్చే పురుగు ఆశించిందని గమనించారు. దీంతోపాటు తామర పురుగు కూడా ఆశించిందని గుర్తించారు. దీనివల్ల నారుమడుల్లో ఆకు చివరి భాగంలో పసుపుగా మారి ఎండిపోతుందని అధికారులు తెలిపారు. దీని నివారణకు దైవతోప్ట్ రెండు మిల్లీగ్రాముల మందును రెండు లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. నారు వేసిన ప్రతి ఒక్క రైతూ తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని సూచించారు. వర్షాధారంపై ఆధారపడిన గ్రామాల్లో వేరుశెనగ పంటలను పరిశీలించి పొటాషియం నైట్రేట్ వాడాలని రైతులకు సూచించారు.

ఆకుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కంప్యూటర్ టీచర్‌కు దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ అప్లికేషన్స్ బోధించేందుకు అర్హత కలిగిన ఆశక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ పి.సురేఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ 55 శాతం మార్కులు, నెట్, సెట్ లేదా పిహెచ్‌డి అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో ఈ నెల 22వ తేదీన కళాశాల లో హాజరు కావాలని సూచించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- ఆనందపురం : అగ్ని ప్రమాదాల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పటిష్టమైన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఫైర్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఆనందపురం మండలం లొడగల పంచాయతీ పరిధిలో ఉన్న హెచ్‌పి పెట్రోల్ బంకులో అగ్ని ప్రమాదాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదాలు సంభవించినప్పుడు తగిన స్పందన చాలా కీలకమైందన్నారు. పెట్రోల్ బంకుల్లో ఏర్పాటు చేసిన సేఫ్టీ గ్యాస్ సిస్టమ్ ద్వారా మంటలను అదుపు చేయవచ్చని తెలిపారు. ప్రతి బంకులోనూ తప్పకుండా సేఫ్టీ పరికరాలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు వంటి వాటిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. బంకు సిబ్బందికి ఫైర్ సేఫ్టీపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో బంకు నిర్వాహకులు పూడి రమేష్, లీడింగ్ ఫైర్ మెన్ చక్రవర్తి ఫైర్ మెన్ రమేష్‌బాబు, శంకరరావు పాల్గొన్నారు.

దీక్షలో మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

విశాఖ విమల విద్యాలయాన్ని తెరవాలి

సిపిఎం కార్పొరేటర్ గంగారావు నిరాహారదీక్ష

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయాన్ని తెరవాలని కోరుతూ జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు బుధవారం ఒక్క రోజు నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షకు పలు కార్మిక సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ, సుమారు 1600 మంది విద్యార్థులు చదువుతున్న ఈ విద్యాలయాన్ని అర్థాంతరంగా మూసివేయడం బాధాకరమన్నారు. స్పందించాల్సిన ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మౌనంగా ఉండటం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థుల ఫీజుల రూపేణా రెండున్నర కోట్ల రూపాయలు వచ్చే పాఠశాలను ఏ కారణంచేత మూసివేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే దీనిపై చర్యలు చేపట్టి పాఠశాలను తెరిచి విద్యార్థుల భవిష్యత్తుకు బాట వేయాలని గంగారావు కోరారు.

బిజెపి నాయకుని నుంచి రక్షణ కల్పించండి

ప్రజాశక్తి -గాజువాక : తమ పేరిట ఉన్న స్థలాలను ఆక్రమించడమే కాకుండా తమను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్న బిజెపి నాయకుడు సాగి కాశీ విశ్వనాథరాజుపై చర్యలు తీసుకోవాలని కూర్మన్నపాలేనికి చెందిన కైలాష్ నగర్ లే-అవుట్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. గాజువాక ఎన్‌బిటి కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, సర్వే నంబర్ 60/3లో 29 మంది ప్లాట్స్‌ను 1982 నుంచి దఫదఫాలుగా కొనుక్కున్నట్లు తెలిపారు. 2005లో గజపతిరాజు సీతారామ వర్మ, పెనుమత్స శ్రీనివాసవర్మను అడ్డంపెట్టుకుని కాశీ విశ్వనాథరాజు మొత్తం స్థలాన్ని కబ్జా చేసి ఆనాటి నుంచి ఇబ్బందులకు గురిచేస్తూనే ఉన్నాడని తెలిపారు. దీనిపై తాము కోర్టును ఆశ్రయించగా కొంత మందికి డిక్రీ ఇచ్చారని జడ్జిమెంట్ వచ్చిన వారంతా స్థలంలోకి వెళితే పోలీసులను అడ్డంపెట్టుకుని లోనికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారని తెలిపారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆర్డర్ కాపీతో స్థలంలోకి వెళ్లి గది నిర్మాణం చేయడానికి ప్రయత్నించగా సతీష్‌నాయుడు, అశోక్‌వర్మలు కొంతమంది మనుషులతో లోనికి ప్రవేశించి గోడ పడగొట్టించారని తెలిపారు. కబ్జాదారుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రి లోకేష్, హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే పల్లా, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. సమావేశంలో కె.లక్ష్మి, వి.కృష్ణ, మాధవి, జగదీష్‌బాబు, సత్యనారాయణ, భవానిరెడ్డి పాల్గొన్నారు.

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-సీతమ్మధార :జివిఎంసి 39వ వార్డుకు చెందిన పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో కొల్లి సింహాచలం ఆధ్వర్యాన జనసేన పార్టీలో చేరారు. కన్వేయర్ బెల్ట్, చిలకపేట, కోటవీధికి చెందిన ఎం.రమణమ్మ, పి.సన్యాసమ్మ, నాగలక్ష్మి, అత్తిలి శ్రీను, వాడిశెల అప్పారావు, అప్పన్న ఎలాజాక్షి, పైడినాయుడు, గంగరాజు, నందిని, దేవి, నూకరత్నం, ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, అరుణ, రాజన్న, రాజమ్మ, ఎల్లాజీ, మాధవి, తదితర సుమారు 100 మందికి సీతంపేటలోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శివప్రసాదరెడ్డి, షాదిక్, తాతారావు, ఉషశ్రీ, ప్రణీత్ పాల్గొన్నారు.

జనన, మరణాల నమోదుపై అవగాహన

ప్రజాశక్తి -సీతమ్మధార : విశాఖలోని ప్రాంతీయ వైద్య ఆరోగ్య కేంద్రంలో జనన మరణ నమోదు, రిపోర్టింగ్ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జివిఎంసి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం, అనకాపల్లి, సాలూరు మునిసిపాలిటీ పరిధిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న గణాంక, ఉప గణాంక, సహాయక గణాంకాధికారులు, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లు హాజరయ్యారు. జనన, మరణాల రిపోర్టింగ్ ప్రక్రియ కీలకమైనదో రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి, డిప్యూటీ డైరెక్టర్ ఎన్ఎస్‌వి.రమణమూర్తి వివరించారు.

స్మార్ట్ మీటర్లు పెట్టకుండా అడ్డుకుందాం

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

పాదయాత్రలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి -యంత్రాంగం

ములగాడ : ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు పెట్టకుండా అడ్డుకోవాలని ప్రజలకు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు జివిఎంసి 58వ వార్డు పరిధి కోడిపందాలదిబ్బలో సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్ పెడితే కరెంటు చార్జీలు విపరీతంగా పెరుగుతాయని, ఆ మీటర్‌కు అయ్యే ఖర్చు రూ.9 వేలు నుంచి రూ.13 వేలు వరకు మనమే భరించాల్సి ఉంటుందని తెలిపారు. సెల్ ఫోన్ వలె ఈ స్మార్ట్ మీటర్‌కు రీఛార్జ్ చేసుకోవాలని, రీఛార్జ్ అయిపోగానే ఇంట్లో కరెంటు ఆగిపోతుందని వివరించారు. ఛార్జీలు కూడా విపరీతంగా పెరుగుతాయన్నారు. ఈ పాదయాత్రలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, కె.రమణ, బి.శ్రీను, కె.నూకరాజు, బి.రాంబాబు, సూరిబాబు, రాము, డి.రాజు, తిరుపతిరావు, రవణమ్మ, రాజేశ్వరి, ఇందిరా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు కొత్తపేట,

జ్యూట్ కార్మికవాడలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

జ్యూట్ కార్మిక వాడ ప్రాంతాల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఇళ్ల గోడలకు స్టిక్కర్లు అతికించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, నాయకులు ఎస్.అప్పలనాయుడు, మంగశ్రీ, రాంబాయి, వెంకయ్యమ్మ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యాన...

ములగాడ : మల్కాపురంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యాన ధర్నా చేశారు. అనంతరం మల్కాపురం సబ్ స్టేషన్ ఎఇకి వినతిపత్రం అందించారు. సిపిఐ నాయకులు కాంగ్రెగుల సత్య ఆంజనేయ, గుడాల రాంబాబు, ఎన్‌వి.త్రినాథ్ పాల్గొన్నారు.

ఆరిలోవ : ఆరిలోవ పెదగదిలి కూడలి వద్ద సిపిఐ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహ్మాన్, నాయకులు దేవుడమ్మ, కాసుబాబు, లక్ష్మణరావు, రవి, సందీప్, రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు మల్లయ్యపాలెం, అయోధ్యనగర్ ప్రాంతాలలో సిపిఐ ఆధ్వర్యాన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మరుపిళ్ల పైడిరాజు, వి.సత్యనారాయణ, ఎంఎస్.పాత్రుడు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఆర్థికంగా మరింత భారం కానున్న స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మన్మధరావు, కె.క్షేత్రపాల్ విజ్ఞప్తి చేశారు. బుధవారం పూర్ణా మార్కెట్‌లో పార్టీ ఆధ్వర్యంలో షాపులకు, ఇళ్లకు వెళ్లి స్మార్ట్ మీటర్ల భారాలపై ప్రచారం చేపట్టారు. జి.సూరిబాబు, ఎ.పైడిరాజు, బి.సాంబయ్య, ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న..

అదాని కంపెనీ ప్రతినిధులను తరిమికొట్టండి

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - సీతమ్మధార : స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న అదానీ కంపెనీ ప్రతినిధులను ప్రజలు తరిమికొట్టాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ పిలుపునిచ్చారు. విశాఖపట్నం అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వార్వా), గ్రేటర్ విశాఖ రెసిడెంట్ కాలనీ అసోసియేషన్స్ ఫెడరేషన్ (నివాస్) ఆధ్వర్యంలో సీతమ్మధారలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు బిగించడం ద్వారా ఎంత కరెంటు వాడుతున్నామో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. మన దగ్గర డబ్బులు వసూలు చేసి జవాబుదారీతనం లేకుండా కరెంట్ బిల్లుల పేరిట దోచుకునే పరిస్థితి ఉంటుందని వివరించారు. అదానీని పెంచి పోషించడానికి నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూనుకోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేయకుండా ఆదానీ కంపెనీ ప్రతినిధులు స్మార్ట్ మీటర్లు బిగించడంపై సిఎం చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లోకేష్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అని పిలుపునిచ్చిన సందర్భాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం వల్ల కలిగే ప్రభావాలు, పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు చాలా ఖరీదైనవని, అందులోని అంతర్నిర్మిత యంత్రాంగం వినియోగదారులకు హాని కలిగించే విధంగా తయారు చేయబడిందని అన్నారు. పీక్, నాన్ పీక్ టైమింగ్‌లను విధించడం, వినియోగదారులకు హానికరమైన ప్రీపెయిడ్ టాప్ అప్ సిస్టమ్‌ను పెట్టడం, ప్రజలకు సరఫరా చేస్తున్న మీటర్లకుగాను అధిక ధరలను రుద్దడం తగదన్నారు. చెత్త పన్నుకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలు విజయం సాధించారని, అదే స్ఫూర్తితో స్మార్ట్ మీటర్లపైనా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్వా అధ్యక్షులు ఎన్.ప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి, కె.సత్యవతి, హరిప్రసాద్, బి.కృష్ణమోహన్, ఎం.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మి అమ్మవారి పండగ

కనకదుర్గాలమ్మ గాయత్రీ దేవి కనకమహాలక్ష్మి అమ్మవార్ల దేవాలయం

ప్రజాశక్తి -మాధవధార : మాధవధార చైతన్య గార్డెన్స్‌లో కనకదుర్గాలమ్మ గాయత్రీ దేవి కనకమహాలక్ష్మి అమ్మవార్ల పండగలను ఆలయ ధర్మకర్త, 51వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సనపల కీర్తి ఆధ్వర్యాన గురువారం నిర్వహించనున్నారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా మూడు దేవాలయాలు ఏర్పాటుచేసి పూజలు నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత. ఒకప్పుడు కనకమహాలక్ష్మి అమ్మవారి విగ్రహం ఈ ఆలయంలో ఉండేది. ఈ ఆలయం పెద్దగా అభివృద్ధికి నోచుకోలేదు. ఈ ప్రాంతంలో ఎవరు పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారింది. అప్పట్లో సనపల సీతారామాంజనేయులు కార్పొరేటర్‌గా ఎన్నికైన సమయంలో ఈ ఆలయాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. తమ సొంత నిధులతో కనకదుర్గాలమ్మ, గాయత్రీదేవి, కనకమహాలక్ష్మి అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేశారు. ఈ ఆలయాలను అనుకుని ఉన్న మర్రి చెట్టుకు 26 ఏళ్ల చరిత్ర ఉంది. ఏటా దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ భక్తులకు ఉచిత చీరల పంపిణీ వంటి వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటామని ఆలయ ధర్మకర్త సనపల కీర్తి తెలియజేశారు.

పండుగకు ఏర్పాట్లు పూర్తి

సీతన్నగార్డెన్స్‌లో గురువారం నిర్వహిస్తున్న కనక దుర్గాలమ్మ గాయత్రీదేవి, కనక మహాలక్ష్మి అమ్మవార్ల పండగకు అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసినట్లు ఆలయ ధర్మకర్త, 51వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సనపల కీర్తి తెలిపారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు పాల్గొని అమ్మవార్లకు పసుపు, కుంకుమలు సమర్పిస్తారని చెప్పారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. పండుగ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

క్లర్క్‌ లేక ఇబ్బందులు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి జోన్ 3 పట్టణ ప్రణాళిక విభాగంలో క్లర్క్ పోస్ట్‌ను భర్తీ చేయకపోవడంతో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఫిర్యాదులను ఎవరూ పట్టించుకోవడంలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వై.మల్లేశ్వరరావు ఈ ఏడాది జనవరి 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. గడిచిన ఆరు నెలలుగా క్లర్క్ పోస్టును భర్తీ చేయకపోవడంతో ఫిర్యాదులు, తపాలా, ఆర్‌టిఐ విభాగాలకు సంబంధించిన పనులు పరిష్కారం కావడంలేదు. అధికారులు స్పందించి క్లర్క్ పోస్ట్ భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అబాకస్‌లో భాష్యం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-పెందుర్తి : ఇటీవల గుంటూరులో ఉమస్ సంస్థ నిర్వహించిన 9వ అబాకస్ రాష్ట్రస్థాయి పోటీల్లో జివిఎంసి 94వ వార్డు పరిధి రవినగర్ భాష్యం స్కూల్‌కు చెందిన మూడో తరగతి విద్యార్థిని కృష్ణహేమానిక సింగ్ ప్రథమ స్థానంలో నిలిచారు. 2500 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో చాంపియన్‌గా నిలిచిన విద్యార్థినికి ఉమస్ సంస్థ ట్రోఫీ, రూ.5000 నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ రాఘవరావు, ప్రధానోపాధ్యాయులు శిరీష విద్యార్థినిని అభినందించారు.

నైటింగేల్, ఫ్లోరెన్స్ నర్సింగ్ కళాశాలల గుర్తింపు రద్దుతో

అయోమయంలో విద్యార్థులు

ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి-అనకాపల్లి జోన్
మండల కేంద్రంలోని నైటింగేల్, ఫ్లోరెన్స్ ప్రైవేటు నర్సింగ్ కళాశాలల గుర్తింపును రద్దు చేస్తు ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ కళాశాలల విద్యార్థులు అయోమయంలో పడ్డారు. విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో కొన్నాళ్ళుగా డీఎంకే విద్యాసంస్థల ఆధ్వర్యంలో నైటింగేల్, ఫ్లోరెన్స్ నర్సింగ్ కళాశాలలను నడుపుతున్నారు. ఈ నర్సింగ్ కళాశాలలకు సంబంధించి క్లినికల్ శిక్షణ ఒప్పందాలు, విద్యార్థుల శిక్షణకు సంబంధించి నకిలీ పత్రాలు సమర్పించడంతో ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఈ కళాశాలలను ప్రజాశక్తి బుధవారం సందర్శించగా కళాశాలలలో ఎటువంటి నేమ్ బోర్డులు లేకపోవడం గమనార్హం. అంతేకాకుండా ఒకే భవనంలో ఈ కళాశాల నడపడం నిబంధనలకు విరుద్ధం. ఫైర్ అండ్ సేఫ్టీ, డ్రైనేజీ, విశాలమైన తరగతి గదులు సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. దీనిపై ఈ కళాశాల యాజమాన్యాన్ని ఫోన్లో వివరణ కోరగా తమ కళాశాలకు గుర్తింపు రద్దు కాలేదని, తాము కోర్టును ఆశ్రయిస్తున్నామని చెప్పారు.

అయితే ఈ కళాశాల భవనంలో డీఎంకే ఐటిఐ, జూనియర్ కాలేజీలు కూడా గతంలో నడిపేవారు. బిల్డింగ్ ఒక్కటే కానీ నాలుగు కళాశాలలు ఉన్నట్లు పలు ఆరోపణలు ఉన్నాయి. జూనియర్ కాలేజ్ వేరొక యాజమాన్యానికి అప్పగించినట్లు విశ్వసనీయమైన సమాచారం. డిఎంకె ఐటిఐ కూడా ఈ భవనంలోనే నడుపుతున్నట్లు తెలిసింది. ఈ కళాశాలలకు మౌలిక వసతులు, విద్యాసంస్థకు ఉండవలసిన అర్హతలు, నిబంధనలు, మౌలిక సదుపాయాలు లేని కారణంగా దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నైటింగేల్, ఫ్లోరెన్స్ నర్సింగ్ కళాశాలలు నడుపుతున్న భవనం ఇదే..

పర్సన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రామారావు

పిఎసిఎస్‌ను లాభాల బాట పట్టిస్తా

ప్రజాశక్తి-కె.కోటపాడు : స్థానిక పిఎసిఎస్‌ను లాభాల బాటలో నడిపిస్తానని ఆ సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జిగా నియమితులైన చీపురుపల్లి రామారావు అన్నారు. కె.కోటపాడు పీఏసీఎస్‌లో సొసైటీ త్రి సభ్య కమిటీ పర్సన్ ఇన్‌ఛార్జి చీపురుపల్లి రామారావు, సభ్యులు రుద్ర ఈశ్వరరావు, దొగ్గ వెంకటరావు బుధవారం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తమపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవికి సిఫార్సు చేశారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, నాయకులు జూరెడ్డి రాము, కసిరెడ్డి అప్పలనాయుడు, సబ్బవరపు రామునాయుడు, కొరువాడ సర్పంచ్ సింగంపల్లి నారాయణమూర్తి, సొసైటీ కార్యదర్శి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పిఎసిఎస్‌ల పాలకవర్గాలు ప్రమాణ స్వీకారం

దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ ములకలాపల్లి పిఎసిఎస్‌ల నూతన పాలకవర్గ (త్రిసభ్య కమిటీ) సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం జరుగుతుందని టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు పెద్దాడ వెంకటరమణ, దొగ్గ దేముడునాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలోని పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో 2022 జూన్ 18న నమోదైన పోక్సో కేసులో నిందితుడు బోడపాటి ఆనంద్ కుమార్‌కు మూడు సంవత్సరాల సాధారణ కారాగార శిక్ష, 1,000 జరిమానా విధిస్తూ, బాధితురాలికి రూ.25 వేలు పరిహారం చెల్లించాలని విశాఖపట్నం పోక్సో కోర్టు తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ 2022 జూన్ 17న రాత్రి బాధిత 10వ తరగతి చదువుతున్న బాలిక తన గదిలో నిద్రిస్తుండగా 18వ తేదీ తెల్లవారుజామున సుమారు 2 గంటల గంటల సమయంలో బోడపాటి ఆనంద్‌కుమార్ బలవంతంగా గదిలోకి ప్రవేశించి, బాలికపై అఘాయిత్యానికి ప్రయత్నించాడు. బాలిక పెద్దగా కేకలు వేయడంతో నిందితుడు అక్కడి నుండి పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలి తల్లి పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో సదరు కోర్టు తీర్పు వెలువరించినట్లు ఎస్పి తుహిన్ సిన్హా పేర్కొన్నారు.

అంగన్వాడీ పోస్టు ఇవ్వాలని నిరాహార దీక్ష

ప్రజాశక్తి అచ్యుతాపురం : గ్రామంలో ఖాళీ అయిన అంగన్వాడీ కార్యకర్త పోస్టును తనకు కేటాయించాలని కోరుతూ మండలంలోని తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన మంత్రి సునీత బుధవారం ఎస్సీ కాలనీ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అనర్హులకు పోస్టును కేటాయించడం తగదని ఆమె పేర్కొన్నారు. గ్రామంలో అన్ని పార్టీలకు చెందిన వారు తనకు పోస్ట్ కేటాయించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా తనకు అన్యాయం జరిగిందన్నారు. దీనిపై కలెక్టర్ ఆఫీసులో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సునీత నిరాహార దీక్షకు కాలనీవాసులు, అంబేద్కర్ సంఘం ప్రతినిధులు మద్దతు తెలిపారు.

తరచూ విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : విద్యుత్ మరమ్మతుల కారణంతో తరచూ సరఫరాలో అంతరాయం కలుగుతుండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలు గ్రామాలకు అనేక సార్లు విద్యుత్ మరమ్మతుల కారణంతో సరఫరాను నిలిపి వేస్తున్నారని వినియోగదారులు ఫిర్యాదు చేస్తున్నారు. అచ్యుతాపురం, కొండకర్ల సబ్ స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ అంతరాయంతో ఏసీలు, ఫ్యాన్‌లు తిరగక వృద్ధులు చిన్నపిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాతావరణం ఒక్కసారిగా వేడెక్కడంతో ఇంట్లో నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. తరచూ విద్యుత్తు అంతరాయం కలగకుండా రెగ్యులర్‌గా విద్యుత్ అందించాలని వినియోగదారులు ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు.

మాట్లాడుతున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్

సూపర్ సిక్స్ అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-కశింకోట : ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆరోపించారు. వైసిపి మండల కార్యకర్తల ఆత్మీయ సమావేశం, చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం బుధవారం ఉదయం తాళ్ళ పాలెం కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో కమిటీలు వేయడం జరుగుతుందని చెప్పారు. పింఛన్ అర్హత వున్నా ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మలసాల కుమార్ రాజా, మలశాల కిషోర్, మళ్ల బుల్లిబాబు, ఎంపిపి కలగా లక్ష్మి గున్నయ్య నాయడు, వైస్ ఎంపిపిలు పెంట కోట జ్యోతి శ్రీను, నమ్మి మీణా గణేష్, గొల్లవిల్లి శ్రీను, ఇతర నాయకులు పాల్గొన్నారు.

యంత్రంతో వరి నాట్లు

ప్రజాశక్తి-దేవరాపల్లి : యంత్రాల ద్వారా నాట్లు వస్తే రైతుకు ఎంతో ఉపయోగ ఉంటుందని మండల వ్యవసాయ అధికారి ఎల్వై కాంతమ్మ అన్నారు. మండలంలోని పెదనందిపల్లి గ్రామంలోని కసింకోట శంకర్, చిత్రాడ జగదీశ్వరరావు రైతుల పొలంలో బుధవారం యంత్రాలతో వరి నాట్లు వేయించారు. మండలంలో కొత్తగా జాయిన్ అయిన గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. యంత్రం ద్వారా నాట్లు వేస్తే మొక్కలు ఒక క్రమ పద్ధతిలో లైన్‌గా రావడం వల్ల గాలి వెలుతురు తగిలి మొక్కలు బాగా పెరగడానికి, కొన్ని తెగులు బారిన పడకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బోయిలకింతాడ, పెదనందిపల్లి, వేచలం, మామిడిపల్లి, ఏ. కొత్తపల్లి గ్రామాల్లో 150 ఎకరాల్లో ఈ యంత్రం ద్వారా నాట్లు వేయడం జరిగిందని వ్యవసాయ అధికారి తెలిపారు. ఒక ఎకరానికి నాట్లు వేసినందుకు రూ.4500 ఖర్చవుతుందని, యంత్రం ద్వారా రోజుకు 5, 6 ఎకరాల వరకు నాట్లు వేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎస్ కిరణ్ కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యంత్రంతో వరి నాట్లు వేస్తున్న దృశ్యం

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి

సిఐటియు ఆధ్వర్యాన తానాంలో నిరసన

నినాదాలు చేస్తున్న సిఐటియు నేత గనిశెట్టి, ఉపాధి హామీ కూలీలు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలో ఉపాధి హామీ కార్మికులకు ఆరు వారాలుగా బకాయి ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని తానాం గ్రామంలో పని ప్రదేశంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు 6వారాల నుండి వేతనాలు చెల్లించకపోవడం వలన తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బకాయ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికులకు మంచినీరు, మజ్జిగ వంటివి సదుపాయాలు కల్పించాలని, పనిముట్లుకు డబ్బులు చెల్లించాలని, వేసవి వేతనం కలిపి 40శాతం అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తుందని విమర్శించారు. ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 200 పని దినాలు, రోజుకి రూ.600 వేతనం అమలు చేయాలని కోరారు. కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన జీవో ప్రకారంగా రూ.309 వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లైవ్ ఆడిట్ పేరుతో ఉపాధి హామీ కార్మికులను వేధింపులకు గురి చేసే విధానం మానుకోవాలన్నారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

జెఎల్‌ఎంలను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలి

ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి డి.సుమన్ కల్యాణికి యుఇఇయు నేతల వినతి

వినతిపత్రం ఇస్తున్న యుఇఇయు నేతలు

ప్రజాశక్తి-చోడవరం : జెఎల్‌ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్‌లను విద్యుత్ సంస్థలో పూర్తిగా విలీనం చేసి అసిస్టెంట్ లైన్మెన్లుగా ప్రమోషన్ ఇవ్వాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు వేపాడ సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.సత్యనారాయణ, పి.శ్రీనివాసరావు, ప్రేమచంద్రశేఖర్ తదితరులు త్రిసభ్య కమిటీకి మెంబెర్, ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి డి.సుమన్ కళ్యాణికి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎస్ఇబి సర్వీస్ రూల్స్, టైం స్కేల్ వర్తింపజేయాలని కోరారు. ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్ 2లకు న్యాయం చేయాలని కోరారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జేఎల్ఎం నాయకులు ఎస్.అప్పలరాజు, కే శంకర్రావు, ఎస్ ఆదినారాయణ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : జీవీఎంసీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ అనకాపల్లి జోన్ కమిషనర్‌కు బుధవారం యూనియన్ నాయకులు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్, క్లాప్ ఆటో డ్రైవర్స్, లోడర్స్ కార్మికులకు, ఆఫీస్ సిబ్బందికి, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి జీవో నెంబర్ 36 ప్రకారం కేటగిరీల వారీగా 21000, 24,500 జీతం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోరిబిల్లి జగదీష్, నిమ్మకాయల నర్సింహామూర్తి, ఎర్రం శెట్టి అప్పలరాజు, బంగారి రవి కుమార్, సింగం పల్లి అజయ్, వానపల్లి శ్రీను, పోలరావు, చిన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై డిఇఒకు వినతి

విద్యా మిత్ర కిట్లు పూర్తిస్థాయిలో సరఫరా చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, విద్యా మిత్ర కిట్లను పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని యుటిఎఫ్ నాయకులు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ప్రమోషన్స్, బదిలీలు కారణంగా కొత్తగా మంజూరైన పోస్టుల పొజిషన్ ఐడీలు, క్యాడర్ స్ట్రెంత్ వివరాలను వీలైనంత తొందరగా డిటిఓకి సర్కులేట్ చేయాలని కోరారు. ఏప్రిల్ జరిగిన స్పాట్ వాల్యుయేషన్, సప్లిమెంటరీ స్పాట్ వాల్యుయేషయిన్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ ఇప్పటివరకు చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లో రీసెంట్‌గా అపాంటైన లాంగ్వేజ్ పండిట్లకు జీతాల నిమిత్తం వారి సంఖ్యకు సమాన స్థాయిలో ఎగ్జెస్ట్ ఎస్‌జిటి పోస్టులను కేటాయించాలని కోరారు. విద్యా మిత్ర కిట్లను మండల స్టాక్ పాయింట్ నుంచి ఆయా స్కూల్‌లకు రవాణా చేసిన హెచ్ఎంలకు రవాణా భత్యం వెంటనే మంజూరు చేయాలన్నారు. సర్వీస్ రెగ్యులరైజేషన్ / ఎన్‌ఒసి వంటి ప్రక్రియల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరారు. హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఇంటర్మీడియట్ తరగతులు బోధిస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు నిర్దిష్టమైన టైం టేబుల్ అనుసరించడానికి, స్టేట్ అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగం చేయడానికి కావలసిన సూచనలు ఇవ్వాలన్నారు.

మాకవరపాలెం మండలం గిడుతూరులో పని చేసి, 2024 ఆగస్టు 25న మృతి చెందిన ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు ఏపీ జిఎల్ఐ, ఈఎల్, పనిచేసిన కాలానికి జీతం బిల్లులు ఇప్పటికీ మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్న సదరు పాఠశాల హెచ్ఎం బాబ్జీరావుపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్దేశ పూర్వకంగా 36 మంది ఉపాధ్యాయుల జూన్ నెల జీతాల బిల్లులు సకాలంలో సబ్మిట్ చేయడంలో అలసత్వం వహించి, వారి జీతాలు రాకపోవడానికి కారణమైన రావికమతం ఎంఈఓ-1పై విచారణ చేసి, తగు చర్యలు తీసుకోవాలన్నారు. చీడికాడ మండలం బయలుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక్క మాథ్స్ ఉపాధ్యాయులు కూడా లేక విద్యార్థుల విద్య కుంటుపడుతుందని, వెంటనే రెండు మాథ్స్ పోస్టులను సర్ ప్లస్‌లో ఉన్న ఒక మాథ్స్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరారు. దీనికి డీఈఓ స్పందిస్తూ ప్రతి సమస్యను సకాలంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, సహాధ్యక్షులు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శి జిఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

త్రినాథ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

త్రినాథ్‌కు ఎమ్మెల్యే కొణతాల పరామర్శ

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి 82వ డివిజన్ టిడిపి ఇన్‌చార్జ్ పోలారపు త్రినాథ్ తండ్రి పోలారపు నరసింగరావు మృతి చెందిన నేపథ్యంలో స్థానిక విజయరామరాజుపేటలోని ఆయన నివాసానికి బుధవారం స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వెళ్లి త్రినాథ్ కుటుంబాన్ని పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయన వెంట కూటమి నాయకులు పీలా నాగ శ్రీను, తాడి రామకృష్ణ, అప్పికొండ గణేష్, భాను అఖిల్ తదితరులున్నారు.

'మోసానికి ప్రతిరూపం వైసిపి'

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఐదు సంవత్సరాల పాటు ఏపీ ప్రజలను లూటీ వైసిపి మోసానికి ప్రతిరూపమని టిడిపి మండల అధ్యక్షులు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్ విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోసపు మాటలతో పరిపాలన సాగించిన వైసిపి ఇప్పుడు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించడంపై ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మాడుగుల నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు రోడ్లు వేశామని డప్పు కొట్టుకుంటున్న వీరు సొంత లాభం కోసమే ఏర్పాటు చేసుకున్నారని నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు సబ్బవరపు రామనాయుడు, కసిరెడ్డి అప్పలనాయుడు, చీపురుపల్లి రామారావు, పూడి నారాయణమూర్తి, రుద్ర ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ రోడ్డు విస్తరణకు చిత్తశుద్ధితో కృషి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పెరుగు బజార్ నుండి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ చిత్తశుద్ధితో ఉన్నారని కూటమి నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం గాంధీ బొమ్మ జంక్షన్లో వారు మాట్లాడుతూ వైసీపీ నేతలు ఆ ప్రాంతంలో పర్యటించి బాధితులకు టీడీఆర్‌లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజలను తప్పుతోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. శాసనసభ్యులు కొణతాల చొరవతోనే మిగిలిన టీడీఆర్‌లు వచ్చాయని చెప్పారు. గతంలో టీపీవో జనార్దన్‌ను అడ్డుపెట్టుకొని రోడ్డును వంకరలు తిప్పి ఎంత మంది వ్యాపారుల దగ్గర డబ్బులు వసూలు చేసారో విచారణ చేద్దామా అని వైసీపీ నాయకులను ప్రశ్నించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మాదంశెట్టి నీలబాబు, జోగినాయుడు, దూలం గోపి, వ్యాపారులు మళ్ల వెంకట్రావు, యల్లంకి సత్తిబాబు, సాయిరాజు, కాండ్రేగుల సతీష్, మునగపాక పార్వతీశం, కోట్ని కొండలరావు, కోట్ని రాంబాబు, జైన్ బ్రదర్స్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : అనకాపల్లి జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థలు ఆధ్వర్యాన విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో కె.కోటపాడు మండల కేంద్రంలోని రామాలయ ఆవరణలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 90 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి వారిని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి బస్సుల్లో తరలించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు కసిరెడ్డి అప్పలనాయుడు, కోఆర్డినేటర్ కన్నూరు అప్పలనాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ బండారు నారాయణ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

బిజెపి మండల అధ్యక్షులుగా అవుగడ్డ

ప్రజాశక్తి-దేవరాపల్లి : బిజెపి మండల అధ్యక్షురాలిగా మారేపల్లికి చెందిన అవుగడ్డ నాయుడమ్మ (సత్యవేణి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పార్టీ శ్రేణులతో సుదీర్ఘ చర్చలు జరిపి అసమ్మతి లేకుండా అందరినీ బుజ్జగించి నాయుడమ్మను అధ్యక్షులుగా ప్రకటించారు. కార్యక్రమంలో కాళ్ల ప్రసాదు, విశ్వనాథం, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పకుండా వేయించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : సంకర జాతి పశువులకు ఉచిత థైలేరియా వ్యాధి నివారణ టీకాల తప్పకుండా వేయించాలని సబ్బవరం ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ఉషాకుమారి అన్నారు. ఈ మేరకు బుధవారం అంతకపల్లి, బోదువలస గ్రామాల్లో 185 సంకర జాతి పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3 నెలలు వయసు దాటిన సంకర జాతి పశువులన్నిటికీ ఉచితంగా థైలేరియా వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ అరుణ మాట్లాడుతూ ఏరియా పశు వైద్యశాల పరిధిలో 6000 డోసులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం రూ.850 విలువ చేసే టీకా ఉచితంగా ఇస్తుందని, రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

కె.కోటపాడు : పాడి పశువుల్లో వచ్చే థైలేరియా వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని కె.కోటపాడు మండల ప్రభుత్వ పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్ కుమార్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని గొండుపాలెం గ్రామంలో సుమారు 100 పాడి ఆవులకు థైలేరియా వ్యాధి నివారణ టీకాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ వ్యాధి వచ్చిన పశువులకు తీవ్ర జ్వరం నీరసం వస్తే పాల దిగుబడి చాలా వరకు తగ్గిపోతుందని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా ఈ టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గుల్లేపల్లి, గొండుపాలెం పశు వైద్య సహాయకులు తేజ, జగన్నాథం పాల్గొన్నారు.

మాడుగుల : మాడుగుల ఏరియా పశు వైద్య శాల పరిధిలో ఉచిత థైలేరియా వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు డాక్టర్. చిట్టి నాయుడు తెలిపారు. మాడుగుల ఏరియా పశు వైద్య శాల పరిధిలోని చీడికాడ మండలానికి 3600 డోసులు, మాడుగుల మండలానికి 5400 డోసులు అందుబాటులో ఉన్నాయని పాడి రైతులు అందరూ తమ వద్ద ఉన్న 3 నెలలు వయసు దాటిన ఆడ, మగ సంకరజాతి పశువులకు ఈ టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. రూ.850 విలువ చేసే టీకా ఉచితంగా ప్రభుత్వం ఇస్తుందన్నారు. మాడుగుల, చీడికాడ మండలాల పరిధిలోని 1160 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు.

పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేస్తున్న దృశ్యం

దర్గాగా పంచాయతీ స్థలం కబ్జా

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని నాగులాపల్లి గ్రామంలో విలువైన పంచాయతీ స్థలం ఆక్రమణకు గురైంది. స్థానిక కూటమి నాయకుని కనుసన్నల్లో పంచాయతీ కార్యదర్శి సారథ్యంలో దర్జాగా భూ దందా సాగడం విశేషం. నాగులాపల్లి పంచాయతీ స్థలంలో షాపుల నిర్మాణం చేపట్టింది. ఈ షాపుల ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. ఈ షాపుల వెనుక గ్రామానికి సంబంధించి ప్రధాన డ్రైనేజీ ఉంది. గ్రామంలో మురుగు నీరు అంతా ఈ కాలువ గుండా ప్రవహించి సాగునీటి కాలువలో కలుస్తుంది. ఈ కాలువ నిర్వహణ కోసం మాజీ సర్పంచ్ యల్లపు వెంకట భాస్కర్ కొంత స్థలాన్ని విడిచి పెట్టడం జరిగింది. ఈ స్థలంపై కూటమి నాయకుని కన్ను పడింది. అంతే అక్కడ రాత్రికి రాత్రే పునాదులు లేచిపోయాయి. కాలువ నిర్వహణ కోసం వదిలేసిన స్థలంలో నిర్మాణం ఏంటి అంటూ ప్రస్తుత సర్పంచ్ కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌కు చెడ్డపేరు తీసుకువచ్చే విధంగా వ్యవహరిస్తున్న ఈ నాయకుని వైఖరిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు పంచాయతీ కార్యదర్శిపై కూడా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, పంచాయతీ స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు.

గ్రీన్ అంబాసిడర్‌లకు ఆరు నెలల బకాయి జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం గ్రామపంచాయతీలో పనిచేస్తున్న నలుగురు గ్రీన్ అంబాసిడర్‌లకు బకాయి ఉన్న ఆరు నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని వారు కోరుతున్నారు. రాజాం గ్రామంలో ఏలుచూరి లక్ష్మణరావు, ఏలుసూరి సింహాద్రి, ఏలుసూరి మరియమ్మ, బల్లెనా లక్ష్మణరావు గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించడానికి గ్రీన్ అంబాసిడర్లుగా పనిచేస్తున్నారు. వీరికి గత ఆరు నెలలుగా వేతనాలను పంచాయతీ చెల్లించడం లేదు. దీంతో కుటుంబ పోషణ కష్టమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే అరకొర వేతనాన్ని సైతం సకాలంలో చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చే వేతనం కేవలం 6000 మాత్రమేనని, రోజుకు 200 రూపాయలు కూడా గిట్టుబాటు కాలేదని వాపోయారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి వేతనాలను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

శ్రమదానంతో పంట కాలువ పూడికతీత

ప్రజాశక్తి-దేవరాపల్లి : రైవాడ కుడి కాలువ పూడిక తీతకు రైతులంతా బుధవారం దండుగా కదిలారు. కత్తులు, కొడవళ్లు చేతబట్టి కాలువలో పేరుకుపోయిన తుప్పలు, నాచు తొలగించారు. కాలువ కింద భూములు కలిగిన బోయిలకింతాడ, కలిగొట్ల, తిమిరాం గ్రామాల రైతులు శ్రమదానంతో చేపట్టిన ఈ పనులను రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ కింద మూడు గ్రామాలకు చెందిన 4 వేల ఎకరాల ఆయకట్టు ఉందని, 6 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ కాలువలో తుప్పలు, డొంకలు తొలగించడానికి రైతులతో 3 రోజులు కష్టపడినట్లు చెప్పారు. కాలువలో పూడిక ఎక్కువగా ఉంటే దానిని తొలగించి, సాగునీటికి ఇబ్బంది లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలిగొట్ల బ్రాంచి ఛానల్ అధ్యక్షుడు సిమ్మినాయుడు, టిడిపి మండల కార్యదర్శి దొగ్గ దేముడునాయుడు, పాల సంఘ అధ్యక్షుడు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

20న తుమ్మపాలలో ఉచిత కంటి శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలోని పోలమాంబ ఆలయం వద్ద ఈనెల 20న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తుమ్మపాల వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఎరుబండి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, రాజా ఆప్టికల్స్ కంటి ఆసుపత్రి, సాయిరాజా వెల్ఫేర్ ట్రస్ట్, తుమ్మపాల వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో కంటిపై ఏర్పడే కంద, మెల్లకన్ను సరి చేయడం, 14 సంవత్సరాల లోపు వయసు వారికి కాటరాక్ట్ ఆపరేషన్, షుగర్ వ్యాధితో ఏర్పడే కంటి నరాల చికిత్స, నల్ల గుడ్డు మార్పిడి, కంటికి సంబంధించిన పలు వ్యాధులకు ఆపరేషన్లు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ శిబిరానికి వచ్చే వారు తమ ఆరోగ్యశ్రీ కార్డు, బ్యాంకు ఎకౌంటు పాసుబుక్కు, ఆధార్ కార్డు తీసుకురావాలని, ఇతర వివరాలకు 9618173699 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి లంకెలపాలెం నూకాంబిక అమ్మవారి గుడి వద్ద స్థానికుల కోరిక మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరును బుధవారం స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు దాసరి రామారావు, చలపరెడ్డి రామారావు, కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ సర్వసిద్ధి సన్యాసి రాజు, గుర్రం నాయుడు, దాసరి గంగాధర్, ఉగ్గిన అప్పారావు, సుందరపు దేవుడు తదితరులు పాల్గొన్నారు.

చిరు జల్లులతో ఉపశమనం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : వారం రోజులుగా వేసవిని తలపించే ఎండలతో విలవిలలాడిన ప్రజానీకానికి బుధవారం కురిసిన చిరుజల్లులు ఉపశమనం కలిగించాయి. చినుకులతో వాతావరణం చల్లబడింది. మండలంలోని దిబ్బిడి, రాజాం, బుచ్చయ్యపేట, కెపి అగ్రహారం గ్రామాల్లో ఓమోస్తరు వర్షం కురిసింది. కొద్దిపాటి వర్షం వల్ల వ్యవసాయం పనులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి 7
గురువారం 17 జూలై 2025

మధ్యవర్తిత్వంపై అవగాహనా ర్యాలీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మధ్య వర్తిత్వం - జాతి శ్రేయస్సు నినాదంతో బుధవారం విశాఖపట్నంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ కౌన్సిల్ సభ్యులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, ప్యానల్ న్యాయవాదులు సుమారు 80 మందితో కలిసి సిఎంఆర్ ఎదురుగాగల కోర్టు గేటు నుండి జగదాంబ జంక్షన్ గంట స్తంభం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ వివిధ న్యాయస్థానాల్లో పేరుకుపోతున్న కేసులను సత్వరం పరిష్కరించే దిశగా మధ్యవర్త్వ విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభించి, పాల్గొన్న ఉమ్మడి విశాఖ ప్రధాన న్యాయమూర్తి రాజు

నర్సీపట్నం : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం 'మధ్యవర్తిత్వం దేశం కోసం' అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు సముదాయం అవగాహనా ర్యాలీని జిల్లా జడ్జి ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్ ప్రారంభించి, పాల్గొన్నారు. న్యాయ వ్యవస్థలో కేసుల పరిష్కారానికి ప్రత్యామ్నాయ పరిష్కార చర్యల్లో భాగంగా మధ్యవర్తిత్వం ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం స్థానిక న్యాయస్థాన ప్రాంగణంలో నిర్వహించిన సదస్సులో న్యాయమూర్తులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా తక్కువ ఖర్చుతో, త్వరితగతిన వివాదాలను పరిష్కరించుకోవచ్చన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. మధ్యవర్తిత్వ విధానం దేశానికి, ప్రజలకు సౌభాగ్యకరం అని తెలిపారు.

భీమునిపట్నం : 'మధ్యవర్తిత్వం - దేశం కోసం' అనే అంశంపై ఈ నెల 10వ తేదీన స్థానిక కోర్టు ఆవరణలో చేపట్టిన అవగాహన సదస్సు 16వ తేదీతో ముగిసింది. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో స్థానిక న్యాయమూర్తులు డి.సౌజన్య పి.స్వాతిభవానీ, మధ్యవర్తిత్వ శిక్షణ పొందిన న్యాయ వాదులు, వీరితో పాటుగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.జనార్ధనరావు, పలువురు న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

గంజాయి కేసులు తగ్గుముఖం

ప్రజాశక్తి -నర్సీపట్నం: ఇటీవల కాలంలో గంజాయి కేసులు తగ్గుముఖం పట్టాయని ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ సిఐ సునీల్ కుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో అల్లూరు జిల్లా గంజాయి పంటలను సమూలంగా నాశనం చేయడంతో ఆ ప్రాంతం నుంచి రవాణా పూర్తిగా తగ్గిపోయిందన్నారు. ఏడాది కాలంగా ఎటువంటి కేసులు నమోదు కాలేదన్నారు. 2021లో అత్యధికంగా 34 కేసులు నమోదు కాగా, 2024-25 నుంచి ఇంతవరకు ఒక కేసు కూడా నమోదు కాలేదన్నారు, గ్రామీణ ప్రాంతాలలో మద్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకున్నామని, అలాగే బెల్ట్ షాపులపై ప్రత్యేక దృష్టి సారించి దాడులు చేస్తూ, కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. నవోదయ2.0 కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో నాటుసారా తయారీ విక్రయాలపై ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్యం తీసుకొస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో మద్యం, గంజాయి, సారా అక్రమ రవాణా,అమ్మకాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై 4405 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి సమాచారం అందజేయాలన్నారు.

ఎక్సైజ్ సిఐ సునీల్ కుమార్

టిడిపి పట్టణ అధ్యక్షునిగా లక్ష్మీనారాయణ

నూతన కమిటీని అభినందిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - మాడుగుల : ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సమక్షంలో మాడుగుల పట్టణ టిడిపి అధ్యక్షుడుగా పుప్పాల లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా వడ్డాది గోపాలవర్మ నియమితులయ్యారు. పట్టణ టిడిపి కమిటీ ఎంపికకు నెల రోజుల కిందట జరిగిన సమావేశంలో కార్యకర్తలు మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో నియోజకవర్గ పరిశీలకులు నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు స్వీకరించారు. అయినా సమస్య కొలిక్కి రాలేదు. దీంతో ఎమ్మెల్యే సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో పార్టీ నేతలు అభిప్రాయాలు సేకరించి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, లెక్కల కాశీబాబు, డిల్లీ నానాజీ, జోన్నపల్లి రమేశ్, పాల్గొన్నారు.

వరి నారుమళ్ల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి : వరి నారుమళ్లలో యాజమాన్య చర్యలపై రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలో జానకయ్యపేట, ఉద్దండపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించి, నారు మళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఉమాప్రసాద్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు సంబంధించి అర్హులైన రైతులు జాబితాను రైతు సేవా కేంద్రాల్లో చూసుకోవాలని,అర్హత కలిగి ఉండి జాబితా లో పేరు లేకపోతే తెలియజేయాలన్నారు. బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం, సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కొబ్బరి, జీడి మామిడి వంటి పంటలలో ప్రకృతి వ్యవసాయ విధానాలను వివరించారు. సేంద్రీయ పద్ధతులలో ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. మొలకదశలో ఉన్న నారుమళ్లను పరిశీలించి, రెండు వారాలుగా వర్షాలు లేని పరిస్థితుల్లో మొలక వచ్చిన వరి ఆకును కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రెండు రోజుల్లో వర్ష సూచన ఉన్నందున వేచి చూడాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు సత్యనారాయణ, సాయి కుమారి, రైతు సేవా కేంద్రం సిబ్బంది కొండలరావు, ప్రశాంతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తాసుబాబు, అప్పారావు, రైతులు పాల్గొన్నారు

మట్టి అక్రమ తరలింపునకు అడ్డుకట్ట

ప్రజాశక్తి - చీడికాడ : మండలంలో అనుమతులు లేకుండా ఇసుక మట్టి, అక్రమ తవ్వకాలు, రవాణాపై రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. బుధవారం మండలంలోని అప్పలరాజుపురం, ఖండివరం గ్రామాల్లో జెసిబిలతో అక్రమంగా మట్టిని తవ్వుతూ, పెద్దఎత్తున ట్రాక్టర్లతో తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు వెళ్లి పరిశీలించారు. ఖండివరంలో రెవిన్యూ అనుమతులు పొందకుండా ట్రాక్టర్లతో మట్టి ఇసుక రవాణా చేస్తుండడంపై తనిఖీలు చేసి, జెసిబి డ్రైవర్లను హెచ్చరించారు. గ్రామాలలో మట్టి, ఇసుకను తరలింపునకు అధికారుల నుంచి అనుమతులకు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి, మంజూరు చేస్తారన్నారు. అనుమతులు లేకుండా అక్రమ రావాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అగ్ని ప్రమాదంలో
పాడి గేదె సజీవ దహనం

మరో గేదెకు తీవ్ర కాలిన గాయాలు

ప్రజాశక్తి - రావికమతం: మండలంలో గర్నికం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పశువుల పాకలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఒక పాడిగేదె అక్కడికక్కడే మతి చెందగా మరొక పాడి గేదె చావు బతుకుల్లో కొట్టుమిట్టాడుతుంది. వివరాలివి.

మండలంలో గర్నికం గ్రామానికి చెందిన కొర్ని భూషబాబుకు చెందిన రెండు పశువుల పాకలు, ఒక గడ్డివాము, ఒక వరికుప్ప, పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో పశువుల పాకలో ఉన్న రెండు చూడి ఉన్న మేలు జాతి పాడి గేదెల్లో ఒకటి ప్రమాదానికి గురై మృత్యువాత పడింది. మరొకటి తీవ్రమైన కాలిన గాయాలతో చావుబతుకుల్లో ఉంది. ఒక్కో గేదె విలువ రూ.1.20లక్షలు కాగా, రెండు గేదెలు రూ.2.40లక్షల విలువ చేస్తాయని బాధిత రైతు భూషబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రమాదంలో గడ్డివాము, వరి కుప్ప, పాకలు దగ్ధం కావడంతో వాటి విలువరూ. నాలుగు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని ఆవేదన చెందుతున్నాడు. ప్రమాదస్థలికి కూతవేటు దూరంలోనే అగ్నిమాపక శకటమున్నప్పటికీ, వారికి సమాచారం అందించినా ఎవరూ అందుబాటులో లేకపోవడంతో భారీ ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

జోరుగా 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి పాయకరావుపేట: మండలం సత్యవరంలో సుపరిపాలనలో తొలిఅడుగులో కార్యక్రమానికి వచ్చిన హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు గ్రామస్తులు హారతులతో ఘనంగా స్వాగతించారు. ముందుగా అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ లర్పించిన అనిత, తర్వాత గౌరీపరమేశ్వర, లక్ష్మి గణపతి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం మండలెంటలోనూ ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కరపత్రాలను పంచుతూ, వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.16 లక్షలతో నిర్మించిన మూడు సిసి రోడ్లను ప్రారంభించారు. వెంకటేశ్వరరావు గోల్డ్ స్కీమ్ మోసంపై స్పందిస్తూ, చట్టపరంగా చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం చేస్తామని భరోసానిచ్చారు.

మంచి మనసు చాటుకున్న అనిత

సుపరిపాలనలో తొలి అడుగులో సత్యవరంలో పర్యటిస్తుండగా, సుంకర ఆనంద్ వికలాంగుడు ఉన్నతనం నుంచి కాళ్లు లేకపోయినా స్వశక్తితో సైకిల్ రిపేర్లు చేసుకుంటూ కుటుంబపోషణ సాగిస్తున్న విషయం తెలుసుకుని ఆయనను కలిసి ఆప్యాయంగా పలకరించారు. ట్రైమోటారు సైకిలు అందిస్తానని మాటిచ్చి మంచి మనసు చాటుకున్నారు.

పాయకరావుపేట సత్యవరంలో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

భీమునిపట్నం : జీవిఎంసి మూడో వార్డు పరిధి బోయివీధిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆధ్వర్యంలో 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.నాగరాజు, ఎం.సంజీవ్‌కుమార్, కొక్కిరి అప్పన్న, వి.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని వెంకటాపురం, రేవిడి గ్రామాల్లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో ఉన్న సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.రమణ, దామోదరరావు, లీలావతి, పావని, నందీశ్వరరావు, గంగరాజు, అప్పలనాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అసకపల్లి, గొల్లలపాలెం, గుల్లేపల్లి, అయ్యన్నపాలెం పంచాయతీల్లో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జి ముఖ్యఅతిథిగా పాల్గొని టిడిపి నేతలతో కలిసి ఇంటింటికి వెళ్లి మహిళలతో సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గండి వంశీదీప్, భరికాన సాయినాథరావు, గండి ముత్యాలు నాయుడు, కరణం రామనాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : జీవిఎంసి 81వ డివిజన్ గవరపాలెం గంగిరేనిచెట్టు ప్రాంతంలో 223 బూత్ పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మళ్ల సూరిబాబు, సూరిశెట్టి రాజు, బొడ్డేడ శ్రీను, పొలిమేర గోపీ, దాడి హరి బాబ్జీ, దాడి వాసు, మద్దాల నాగ శివ, సూరిశెట్టి బల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోకులపాడులో ఉచిత వైద్యశిబిరం

జన్మదిన కేకు కట్ చేస్తున్న జ్యోతీకుమార్

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : తిమ్మాపురం శివారు గోకులపాడు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు లింగంపల్లి జ్యోతికుమార్ పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గోకులపాడు రామాలయం ఆవరణలో జనసేన డాక్టర్స్ సెల్ విభాగం చైర్మన్ బొడ్డేపల్లి రఘు నేతృత్వంలో 150 మంది రోగులను పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం జనసేన పాయకరావుపేట ఇన్‌ఛార్జి గెడ్డం బుజ్జి ఆధ్వర్యంలో జ్యోతికుమార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ బోదపాటి శివదత్, గ్రామ సర్పంచ్ కర్రి సత్యన్నారాయణ, మాజీ సర్పంచ్ మాలెం బాబ్జీ, అల్లు నర్సింహామూర్తి, మాలెం రాజు పాల్గొన్నారు.

గోవా గవర్నర్‌ను కలిసిన స్పీకర్ అయ్యన్న

అశోక్‌గజపతిని అభినందిస్తున్న అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : గోవా గవర్నర్‌గా నియమితులైన మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజును బుధవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ, గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు నియమితులైన సమాచారం రాష్ట్రమంతటా పండుగ వాతావరణం నెలకొందన్నారు. 1983లో టిడిపి ఆవిర్భావం నుంచి తాను అశోక్‌గజపతితో కలిసి రాజకీయ ప్రస్థానం కొనసాగించానన్నారు. ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పటి నుండే అశోక్ గజపతి రాజు తమకు మార్గదర్శకులుగా, సలహాదారులుగా ముందుండి నడిపించారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు అన్నారు, నీతి, నిజాయితీకి, క్రమశిక్షణకు ప్రతిరూపమైన అశోక్‌గజపతిరాజును గోవా గవర్నర్‌గా నియమించడం సముచితమని, ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రంథాలయ నిర్వహణపై సంతృప్తి

లైబ్రరీని పరిశీలిస్తున్న జెడ్‌జిఎస్ సెక్రటరీ కుమార్‌రాజు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక శాఖ గ్రంథాలయ నిర్వహణ, పురోభివృద్ధిపై ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి కుమార్‌రాజు సంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక శాఖ గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలో పుస్తకాల నిర్వహణ, వసతులు, పాఠకుల సంఖ్య, ఇతర వివరాలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే గ్రంథాలయంలో పిల్లల విభాగం పరిశీలించారు. గ్రంథాలయంలో రికార్డులను పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం శాఖ గ్రంథాలయాన్ని లైబ్రేరియన్ దమయంతి బాగా తీర్చిదిద్దారని, పాఠకులు, విద్యార్థులు, ఇతర అన్ని వర్గాల ప్రజలు గ్రంథాలయాన్ని మంచిగా వినియోగించుకోవడానికి వీలుగా తీర్చిదిద్దారన్నారు. పోటీ పరీక్షల అభ్యర్థులకు అవసరమైన పఠన సామగ్రిని అందుబాటులో ఉంచడం అభినంద నీయమన్నారు. గ్రంథాలయాన్ని స్వాతంత్ర సమరయోధులు, దేశ నాయకులు, ఫోటోలను వారి సేవలు ప్రతిబింబించే విధంగా తీర్చిదిద్దారని,దాతల సహకారంతో పాఠకులకు కావాల్సిన మౌలిక సదుపాయాలను సమకూర్చారన్నారు. ప్రజల్లో పఠనాభిరుచి పెరిగేలా దమయంతి చర్యలు తీసుకుంటున్నారని, పాఠకులతో మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నర్సీపట్నం లైబ్రరీని ఇతర శాఖా గ్రంథాలయాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్, పాఠకులు పాల్గొన్నారు.

బిసి హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో గొడిచెర్ల బిసి హాస్టల్‌ను స్థానిక ఎంపిడిఒ డి సీతారామరాజు బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇంటింటా తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. తడి పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అల్లు రమణ పాల్గొన్నారు.

రూ.25 లక్షల ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని

భూనిర్వాసితుల పాదయాత్ర

- తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా, వినతి
- ఆందోళనకు సిపిఎం, వైసిపి సంఘీభావం

పాదయాత్రగా వస్తున్న నిర్వాసితులు, నాయకులు

ప్రజాశక్తి- నక్కపల్లి : వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు న్యాయం చేయకుంటే ఉద్యమం తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసిపి నేత, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, హెచ్చరించారు. ఇళ్లు కోల్పోతున్న నిర్వాసిత కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.25 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని, ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కారిడార్ నిర్వాసితులు బుధవారం మండుటెండను సైతం లెక్కచేయకుండా పాదయాత్ర చేపట్టారు. నిర్వాసితులకు వైసిపి, సిపిఎం నేతలు సంఘీభావం తెలిపి పాదయాత్రలో పాల్గొన్నారు. మండలంలో చందనాడ పంచాయతీ తుమ్మలపేట నుండి చందనాడ,ఎన్.నర్సాపురం,ఉపమాక గ్రామాల మీదుగా నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వరకు 10 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది.అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి, తహసిల్దార్ నరసింహామూర్తికి వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా సిపిఎం నేత అప్పలరాజు, వైసిపి నేత వీసం రామకృష్ణ, ఎంపిటిసి గంటా తిరుపతిరావు, తళ్ళ భార్గవ్ నిర్వాసితులతో కలిసి మాట్లాడారు. భూములు ఇచ్చిన నిర్వాసితులకు అధికారులు న్యాయం చేయడం లేదని మండిపడ్డారు. అనేకసార్లు వినతిపత్రాలు అందజేసినప్పటికీ స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.25 లక్షలు చెల్లించాల్సిందేనని ఇప్పటికే అనేకసార్లు పోరాటం చేస్తే, 5 సెంట్లు ఇంటి స్థలం, రూ.8.98 లక్షలు ప్యాకేజీ ఇస్తామని అధికారులు చెబుతున్నారని, దీనిని తామంతా పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. ప్యాకేజీని రూ.25 లక్షలు చెల్లించాలని లేనియెడల పెద్ద ఎత్తున

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వాసితుల ధర్నా

ఆందోళన చేపడతామని హెచ్చరించారు.
2013 భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘించి నిర్వాసితులకు ద్రోహం చేస్తున్నారన్నారు. అభివృద్ధి అని ప్రచారం చేస్తున్న అధికారులకు, ప్రజా ప్రతినిధులకు నిర్వాసితులు సమస్యలు ఎందుకు పట్టడం లేదని, వారిని దగా చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర హోం మంత్రి అనిత నిర్వాసితుల కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చి ఏర్పాటు చేయబోయే పరిశ్రమలలో ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని అనేక సభల్లో మాట్లాడుతున్నారని, ఒక వైపు బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటులో భాగంగా మౌలిక వసతులు కల్పన కోసం రోడ్లు, ఇతర అభివద్ధి పనులు శరవేగంతో జరుగుతుంటే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు.
నిర్వాసితులందరికీ ఆర్ కార్డులు ఇవ్వాలని, 18 ఏళ్లు నిండిన నిర్వాసిత కుటుంబాల్లోని వారందరికీ మనవడు, మనవరాళ్లు అనే తేడా లేకుండా అలాగే వివాహమైన ఆడపిల్లలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలన్నారు. జిరాయితీ, డీ ఫారం భూములలో చెట్లు, బోర్లు, ఇతర ఆస్తులకు పరిహారం చెల్లించాలని, డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నానాజీ, సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నిర్వాసితులు అప్పలస్వామి, జీ.గోవిందరావు, ఆర్. పద్మ, కె.రాణి,అమ్మాజీ, ముసలి నాయుడు, మంగ,దార బాబు, రమేష్ , వెంకటేష్, నాగేంద్ర ,నానాజీ, శ్రీను,కిష్టారావు పాల్గొన్నారు.

కోరం లేక ఎంపిపి ఎన్నిక వాయిదా

సభ్యుల కోసం ఎదురుచూస్తున్నఎన్నికల అధికారి, ఖాళీగా ఉన్న కుర్చీలు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : స్థానిక మండలపరిషత్ అధ్యక్షుని ఎన్నిక కోరం లేక వాయిదా పడినట్లు ఎన్నికల అధికారి, డిప్యూటి కలెక్టర్ మనోరమ తెలిపారు. బుధవారం ఉదయం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి ఎన్నిక ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం పది గంటల నుండి ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల అధికారి మనోరమ, ఎంపిడిఒ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, సభ్యుల రాకకు ఎదురుచూశారు. అయితే వైసిపికి చెందిన 13 మంది, టిడిపి చెందిన వారు కూడా ఎన్నిక సమావేశానికి హాజరు కాకపోవడంతో ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు రేపటికి వాయిదా వేసినట్లు తెలిపారు.

జ్వర పీడిత గ్రామాల్లో వైద్య శిబిరాలు

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి- నాతవరం : మండలంలోని నాతవరం, మాధవ నగరం, డి.యర్రవరం, గుమ్మడి గొండ, తదితర గ్రామాల్లో కొన్ని రోజులుగా విష జ్వరాల ప్రబలి ప్రజలు అల్లాడిపోతున్నారు. విష యం తెలుసుకున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు వెంటనే వైద్యసిబ్బందిన అప్రమత్తం చేయడంతో బుధవారం నాతవరం రామాలయం వద్ద అలాగే చమ్మ చింత, డి.యర్రవరం, మాధవనగరం గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. డిఎంహెచ్‌ఒ హైమావతి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ వీరజ్యోతి, డిపిఎమ్ఒ డాక్టర్. ప్రశాంతి, తహశీల్దార్ వేణుగోపాల్, డిఐఒ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ఎస్తేరు రాణి వంటి వైద్యాధికారులు హాజరై మెడికల్ టీమ్‌లను సమన్వయం చేశారు. జ్వరం లక్షణాలు ఉన్న రోగులను పరీక్షించి మందులు అందించారు. విషజ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, మండల పార్టీ ప్రెసిడెంట్ నందిపల్లి వెంకటరమణ, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు ఇనపసప్పల సత్యవతి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

బాక్సింగ్‌లో మోక్షిత్‌కు కాంస్యం

మోక్షిత్‌ను అభినందిస్తున్న స్కూల్ సిబ్బంది

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : విశాఖ రైల్వే స్టేడియంలో ఈనెల 12,13 తేదీలలో జరిగిన సబ్ జూనియర్ బాయ్స్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో నింజాస్ అకాడమీ శిక్షణార్థుడు కుంచె మోక్షిత్ కాంస్య పతకం సాధించాడని అకాడమీ డైరెక్టర్ అబ్బు తెలిపారు. స్థానిక నారాయణ స్కూల్‌లో చదువుతున్న మోక్షిత, నింజాస్ అకాడమీలో బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నాడు. మోక్షిత్ కాంస్య పతకం సాధించడంపై స్కూల్ ప్రిన్సిపాల్ రెడ్డి శ్రీరామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అల్లు నాగేశ్వరరావు సిబ్బంది అభినందించారు. 67కిలోల విభాగంలో మోక్షిత్ కాంస్య పతకం సాధించడంపై ఎపి బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారని అబ్బు తెలిపారు.

ప్రజాశక్తి కావలెను
ప్రతి అక్షరం - ప్రజలపక్షం
ప్రతిష్టాత్మక దినపత్రిక ప్రజాశక్తికి ఈ కింది కేంద్రాల్లో విలేకర్లు కావాలి.
అభ్యర్థులకు తెలుగులో రాయగల రచనా సామర్థ్యం, రాయాలనే ఆసక్తి, సామాజిక స్పృహ ఉండాలి

విశాఖపట్నం జిల్లా		అనకాపల్లి జిల్లా
సింహాచలం	కూర్మన్నపాలెం	మాకవరపాలెం
సింధియా	సిరిపురం	యలమంచిలి రూరల్
మద్దిలపాలెం	కంచరపాలెం	ఎస్.రాయవరం

ఉద్యోగ అవకాశాలు
అనకాపల్లి జిల్లా కేంద్రం విలేకరి
ఎడివిటి గాజువాక జోన్ ఇన్‌ఛార్జి
జాబ్‌వర్క్ ఎగ్జిక్యూటివ్
అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత
ఇంటర్వ్యూ : తేది : 18-07-2025 శుక్రవారం ఉదయం 10 గ॥ల నుండి
అడ్రస్ : ప్రజాశక్తి కార్యాలయం,
ప్లాట్ నెం.3 'జి' బ్లాక్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఆటోనగర్, విశాఖపట్నం-46
సెల్ : 9491570765, 9490099125